పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి పెట్టాలి

- లిఫ్టులను ప్రభుత్వమే నిర్వహించాలి
- ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లింపు గడువు పెంచాలి : విలేకర్ల సమావేశంలో జూలకంటి



నవతెలంగాణ-మిర్యాలగూడ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి దృష్టిపెట్టాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎస్-ఎల్‌బీసీ, ఎస్ఆర్ఎస్‌పీ, డిండి ఎత్తిపోతల పథకం, ఇతర సాగునీటి ప్రాజెక్టులకు నిధులు లేక నిలిచిపోయాయని అన్నారు. వెంటనే దీనిపై సమీక్ష నిర్వహించి నిధులు కేటాయించి ప్రాజెక్టులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ పరిధిలోని లిఫ్టులను ప్రాజెక్టు అంతర్భాగంలోకి తీసుకొని ప్రభుత్వం నిర్వహణ బాధ్యతలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారంటీలను గ్యారెంటీగా అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ప్రస్తుతం యాసంగి సీజన్ ధాన్యం మార్కెట్లోకి వస్తుందని, మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అధికారుల, ప్రభుత్వ పర్యవేక్షణ లోపం కారణంగా రైతుల పండించి పంటకు మద్దతు ధర అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్ఆర్ఎస్, ఆస్తి పన్ను చెల్లింపు గడువు మరో నెలరోజులపాటు పొడిగించాలని డిమాండ్ చేశారు.

గడువు చివరి రోజుల్లో ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ ఇవ్వడం వల్ల ఎక్కువ మంది వినియోదారులు పన్నులు చెల్లించలేకపోయారని, అదేవిధంగా ఎల్ఆర్ఎస్ విషయంలో అనేక ఇబ్బందులు ఉన్నాయని వాటిని తొలగించి ఫీజు రాయితీ 50 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. అడవిదేవులపల్లిలో సత్రశాల బ్రిడ్జి నిర్మాణం చేపట్టినట్లయితే వ్యవసాయం, పారిశ్రామికరంగం అభివృద్ధి చెందడంతోపాటు రెండు రాష్ట్రాలకు ప్రయోజకరంగా ఉంటుందని చెప్పారు.

అదేవిధంగా డంపింగ్ యార్డ్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై ముఖ్యమంత్రి దృష్టి సారించి సమీక్ష పెట్టి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవి నాయక్, పాదురీ శశిధర్‌రెడ్డి, భవాండ్ల పాండు, లక్ష్మీనారాయణ వెంకటరెడ్డి ఉన్నారు.

పారదర్శకంగా మూల్యాంకనం చేపట్టాలి

- విద్యార్థులకు న్యాయంగా మార్కులు కేటాయించాలి
- ఎగ్జామినర్లకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య ఆదేశం
- మేడ్చల్ జిల్లా మూల్యాంకన కేంద్రం పరిశీలన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న మేడ్చల్ జిల్లా జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఎగ్జామినర్ల పనితీరును ఆయన పరిశీలించారు. సమయపాలన పాటించాలనీ, ప్రశాంత వాతావరణంలో విద్యార్థులకు న్యాయంగా మార్కులను కేటాయించాలని కోరారు. ప్రతి ఎగ్జామినర్ జాగ్రత్త వహించాలని సూచించారు. మూల్యాంకన కేంద్రంలో ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూల్యాంకన విధిని అత్యంత పారదర్శంగా నిర్వహించాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు. మూల్యాంకన కేంద్రంలో నిర్వహిస్తున్న వివిధ ప్రక్రియలను పరిశీలించి సిబ్బందికి మూల్యాంకన ప్రక్రియలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉగాది సందర్భంగా మూల్యాంకన కేంద్రాలకు ఆదివారం సెలవు ప్రకటించామని తెలిపారు. సెలవు అనంతరం మూల్యాంకనం మరింత సమర్థవంతంగా కొనసాగించి నిర్ణీత గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అమెరికా జట్టుకు టీడీసీఏ షాక్

హైదరాబాద్ : తెలంగాణ జిల్లాల క్రికెట్ సంఘం (టీడీసీఏ) అండర్-17 వన్డే ట్రోఫీలో అమెరికన్ యూత్ క్రికెట్ అకాడమీ (ఏవైసీఏ) జట్టుకు టీడీసీఏ రూరల్ జట్టు షాక్ ఇచ్చింది. వరుస విజయాల ఊపుమీదున్న ఏవైసీఏపై 21 పరుగుల తేడాతో గెలుపొందింది. అభినవ్ గౌడ్ (143) సెంచరీతో చెలరేగటంతో టీడీసీఏ రూరల్ తొలుత 40 ఓవర్లలో 243/10 పరుగులు చేసింది. ఛేదనలో ఏవైసీఏ 49.1 ఓవర్లలో 222 పరుగులకు కుప్పకూలింది. తనూశ్ (92 నాటౌట్) పోరాడినా.. అమెరికా యూత్ జట్టుకు ఓటమి తప్పలేదు. అద్భుత ప్రదర్శన కనబరిచిన తెలంగాణ జట్టును టీడీసీఏ అధ్యక్షులు అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి అభినందించారు.

ఆహార భద్రత అధికారులను నియమించాలి

- ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయాలి
- మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబులను పని చేయించాలి : సీఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆహార భద్రత అధికారులను నియమించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఫోరం అధ్యక్షులు యం.పద్మనాభరెడ్డి సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాదులో ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ లను ఏర్పాటు చేయాలనీ, మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబులను పని చేయించాలని ఆయన కోరారు. ఆహార భద్రత అధికారులు లేకపోవడంతో కల్తీ వ్యవహారం ఇష్టారాజ్యంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ ఒకటే ఉందనీ, అందులో పరీక్ష నిమిత్తం సరియైన పరికరాలు లేవని తెలిపారు. ఈ లేబొరేటరీలో సైంటిస్టులు, ఇతరులు కలిపి 78 పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 11 మంది మాత్రమే పని చేస్తుండటంతో ఈ ల్యాబ్ నామమాత్రంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వము రెండు సంవత్సరాల క్రితం వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాదులో ల్యాబులు మంజూరు చేసి నిధులు కూడ విడుదల చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధులను వినియోగించుకోలేకపోవడంతో ఆ నిధులు ల్యాప్స్ అయ్యే ప్రమాదముందని హెచ్చరించారు. రాష్ట్రంలో ఒక సంచార ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఉన్నప్పటికీ అందులో సరిపడ పరికరాలు లేక పరీక్షలు అంతంత మాత్రమే జరుగుతున్నాయి.

రాష్ట్ర ప్రభుత్వం 5 వ్యానులైతే కొన్నారు కాని అందులో పరీక్షల కొరకు కావలసిన పరికరాలు కొనకపోవడంతో కేంద్ర నిధులు ల్యాప్స్ అయ్యే పరిస్థితి ఉందని చెప్పారు. గతంలో ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆహార కల్తీ గురించి ప్రజలు ఫిర్యాదు చేయడానికి ఒక విభాగం ఏర్పాటు చేయాలని నిర్ణయించినా అది కార్యరూపం దాల్చక కాగితాలకే పరిమితమైందని వెల్లడించారు.

స్పోర్ట్స్ హబ్‌గా హైదరాబాద్

ముగిసిన జాతీయ కరాటే పోటీలు

హైదరాబాద్ : 2027 ఆసియా కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు హైదరాబాద్ వేదిక కానుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ 'హైదరాబాద్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారని పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గచ్చిబౌలి స్టేడియంలో నాలుగు రోజుల పాటు జరిగిన జాతీయ కరాటే పోటీలు శనివారంతో ముగిశాయి. 1500 మంది క్రీడాకారులు పోటీపడిన ఈవెంట్‌లో విజేతలుగా నిలిచిన అథ్లెట్లు, జట్లకు మహేశ్‌కుమార్ గౌడ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కరాటే క్రీడాకారులకు సీఎం రేవంత్‌రెడ్డి తన సందేశాన్ని పంపించారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.

నేడు ఉగాది పచ్చడి, గుడాల పంపిణీ

ఆదిలాబాద్‌టౌన్: నూతన తెలుగు సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి, గుడాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని శ్రీశ్రీశ్రీ యోగానంద సరస్వతీ తెలిపారు. శనివారం పట్టణంలోని గోపాలకృష్ణ మఠంలో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆదివారం ఉదయం 8.30గంటలకు సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పచ్చడి, గుడాల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, దీన్ని పట్టణ ప్రజలు స్వీకరించాలని తెలిపారు. సమావేశంలో సమితి అధ్యక్షులు ప్రమోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గెడం మాధవ్, కోశాధికారి పడకంటి సూర్యకాంత్, గౌరవ అధ్యక్షులు బండారి వామన్, కార్యనిర్వాహక కార్యదర్శి కందుల రవీందర్, ఉపాధ్యక్షులు సామనపెల్లి నర్సిములు, ఎన్నావార్ రాజు పాల్గొన్నారు.



11వ రోజు సీసీఐ దీక్షలో పద్మశాలీ సంఘం

ఆదిలాబాద్‌టౌన్ : సిమెంట్ పరిశ్రమ పునరుద్దరణ కోసం సీసీఐ సాధన కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నయి. ఈ దీక్షలు శనివారం నాటికి 11వ రోజుకు చేరుకోగా పద్మశాలీ సంఘం నాయకులు కూర్చున్నారు. వీరికి సాధన కమిటీ కో - కన్వీనర్ వెంకట్‌నారాయణ, బొల్లు ఈశ్వర్, అరుణ్‌కుమార్ పూలమాలలు వేసి దీక్షలు ప్రారంభించారు. వారికి మద్దతుగా సిపిఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు కుంటాల రాములు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు దాసరి రమేష్, హన్మండ్ల ఈరన్న, మెంచు గణేష్, చౌటివార్ రమేష్, కటకం సుదర్శన్, దాసరి రవీందర్, మంజు సదానందం, చౌట్‌పల్లి రాజేశ్వర్, గౌడ వైకుంఠం, పరమేశ్వర్, ఎస్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షులు ఎం.నగేష్, పొచ్చన్న, శత్రుఘన్, పొచ్చన్న, ఆశన్న పాల్గొన్నారు.



సిబ్బంది నియామకంతో నాణ్యమైన బోధన



ఆసిఫాబాద్ : జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో సహాయ ప్రొఫెసర్ల నియామకాలతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందే అవకాశముంటుందని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శనివారం మండలంలోని అంకుశాపూర్‌లో గల ప్రభుత్వ వైద్య కళాశాలలో సహాయ ప్రొఫెసర్ల ఎంపిక కొరకు నిర్వహించిన ఇంటర్వ్యూకు జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శ్రీలక్ష్మితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలోని వైద్య విద్యార్థిని, విద్యార్థులకు విద్యా బోధన అందించేందుకు సహాయ ప్రొఫెసర్లను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశామన్నారు. ప్రభుత్వం వైద్య కళాశాలల ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంపొందిస్తామని తెలిపారు. అనంతరం కళాశాలలోని వివిధ బ్లాక్‌లను పరిశీలించి, పనులను త్వరగా పూర్తిచేసి వైద్య విద్యార్థులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం : బొజ్జు



జన్నారం : రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండలంలోని రోటిగూడ, అల్లినగర్, దొంగపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రూ.10లక్షల ఆరోగ్య బీమా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా పథకాలు ప్రతి గడపడకు చేరుతున్నాయని అన్నారు. ఇటీవల ప్రభుత్వం యువ వికాసం పథకాన్ని ప్రారంభించిందని, గ్రామాల్లోని ప్రతి ఒక్క యువతీ యువకుడు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అనంతరం మహ్మదాబాద్ గ్రామంలో చలి వేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవలే చికిత్స పొంది ఇంటికి చేరుకున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముత్యం రాజన్ననను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ మూలంగానే బడుగులకు రాజ్యాధికారం

- ఘనంగా టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవం



ఆదిలాబాద్‌టౌన్ : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ ఎన్టీఆర్ రామారావు మూలంగానే బడుగులకు సైతం రాజ్యాధికారం దక్కిందని, మహిళలకు రిజర్వేషన్ ఫలాలు అందుతున్నాయని టీడీపీ సీనియర్ నాయకులు అల్లూరి రాజారెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ 43వ వసంతోత్సవాన్ని పురస్కరించుకుని పార్టీ ఆవిర్భావ వేడుకలను పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శనివారం ఎన్టీఆర్ చౌరస్తాలో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. ఆయన అందించిన సేవలను టీడీపీ నాయకులు మననం చేసుకున్నారు. తెలుగువారంతా గర్వించదగ్గ నేత నందమూరి తారకరామారావు అని అల్లూరి రాజారెడ్డి అన్నారు. తెలుగువారి కీర్తిని ఖండాంతరాలకు చాటిచెప్పిన మహానుభావుడన్నారు. పేదలు, బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయన వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. ఆయన నేతృత్వంలో పార్టీ పురోభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు పాటుపడుతున్నారన్నారు. తెలుగు దేశం పార్టీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులందరూ ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకలు గాలిపెల్లి నాగన్న, ఆకుల రాము, సోమ గంగారెడ్డి, కాడే రాములు, కడదరపు దేవిదాస్, నూనె సతీష్, ఓసా ప్రమోద్, తోకల గంగమ్మ, జక్కుల సుభాష్, గోక శ్రీనివాస్‌రెడ్డి, పెంటన్న, మోరకండి అశోక్, అంబూబాయి, సరస్వతి, అంజలి పాల్గొన్నారు.

తలమడుగు : మండలంలోని సుంకిడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను ఆవిష్కరించి ఆ పార్టీ నాయకులు సోమ గంగారెడ్డి, కాడే రాములు మాట్లాడుతూ దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పేదల పెన్నిధి అని తెలిపారు. పేదల కోసం స్థాపించిన తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ప్రజలను నిద్రలేపిందన్నారు. పేద ప్రజల కోసం తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడు సేవలు అందించేందుకు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జక్కుల అశోక్, మహేష్, నారాయణ, ఆశన్న, ఇస్తారి, మల్లేష్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరం



మందమర్రి : బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగడం చట్టారీత్యా నేరమని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి మందుబాబులను హెచ్చరించారు. సీఐ ఆధ్వర్యంలో శనివారం సర్కిల్‌లోని మందమర్రి, కాసిపేట, దేవాపూర్, రామకృష్ణాపూర్‌లో బహిరంగ మద్యపానం, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వ్యక్తులను గుర్తించి వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కేసులు నమోదు చేయడమే కాకుండా అటువంటి వ్యక్తులలో మార్పు తీసుకురావడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపితే డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ప్రమాదాలతో ప్రాణనష్టం జరుగుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మున్ముందు కొనసాగిస్తూ సమాజంలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. పునరావృతం చేసే వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, కాసిపేట ఎస్ఐ ప్రవీణ్, మందమర్రి అదనపు ఎస్ఐ ఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందనేదీ..?

- ఫీజు చెల్లించేందుకు దరఖాస్తుదారుల వెనుకడుగు
- 25శాతం రాయితీ కల్పించినా కనిపించని ప్రయోజనం
- ఈ నెల 31వ తేదీతో ముగియనున్న గడువు

లేఅవుట్ రెగ్యూలరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) ప్రక్రియకు అనుకున్న స్థాయిలో స్పందన రావడం లేదు. అనుమతిలేని లేఅవుట్లు కలిగిన వారు ఎక్కువ మంది ముందుకు రాకపోవడంతో ఈ ప్రక్రియకు అవాంతరాలు ఏర్పడుతున్నాయి. అక్రమ లేఅవుట్లకు అనుమతులు కల్పిస్తామని సర్కారు చెబుతున్నా కొందరు దరఖాస్తుదారులు పెడచెవిన పెడుతున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా ప్రభుత్వం ఆశించిన ప్రయోజనం పూర్తిస్థాయిలో నెరవేరడం లేదు. దరఖాస్తులు 20వేలకు పైగా రాగా ఇప్పటి వరకు ఫీజు చెల్లించినవారు కేవలం 2వేలకు పైగా మంది మాత్రమే ఉండటంతో ఈ ప్రక్రియ ఎంత నెమ్మదిగా సాగుతుందో తెలిసిపోతోంది. దరఖాస్తుదారులు చెల్లించే ఫీజులో ప్రభుత్వం 25శాతం రాయితీ అవకాశం కల్పించినా.. జనం నుంచి అంతగా స్పందన రావడం లేదు. ఈ నెల 31తో గడువు ముగిసిపోనుండగా.. రెండు రోజుల పాటు సెలవులే ఉండనున్నాయి. ప్రభుత్వం మరిన్ని రోజులు గడువు పెంచుతుందా.. ఇంతటితోనే ముగిస్తుందా అనేది ఉత్కంఠ రేపుతోంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

అక్రమ లేఅవుట్లలోని ప్లాట్లను సక్రమం చేసుకునేందుకు ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌ను చేపట్టింది. ఏండ్లుగా అక్రమంగా ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరిస్తే యజమానులకు అనుమతి పత్రాలు అందించడంతో పాటు ప్రభుత్వ ఖజానాకు సైతం ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తోంది. ఇందుకు 2020 ఆగస్టు 26 కంటే ముందు అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. గతంలోనూ ఈ ప్రక్రియ చేపట్టినా వివిధ కారణాలతో దరఖాస్తుదారుల నుంచి ఆశించిన స్పందన రాలేదు. తాజాగా మూడు నెలల క్రితం సైతం మళ్లీ వీటికి ఫీజు చెల్లించి అనుమతులు తీసుకోవాలని సూచించడంతో పాటు ఈ దఫా ఫీజు చెల్లించే వారికి అందులో 25శాతం రాయితీ కల్పిస్తామని అవకాశం కల్పించింది. దీంతో ఇప్పటికే కొందరు ఫీజు చెల్లించగా.. మిగితా వారు కార్యాలయాలు, మీసేవా కేంద్రాలకు వెళ్తున్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 22,369 దరఖాస్తులు రాగా..14,450మందికి ఫీజు చెల్లించాలని అధికారులు సూచించారు. ఇందులో ఇప్పటి వరకు కేవలం 2500 మంది వరకు మాత్రమే ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించారు. శనివారం మరో 300 మంది వరకు చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రచారం కల్పించినా..స్పందన లేదు..!

అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని.. ప్రభుత్వం రాయితీ అవకాశం కల్పించింది. ఈ దఫా మొత్తం ఫీజులో 25శాతం రాయితీ కల్పిస్తామని సూచించింది. అధికారులు ఈ అంశంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించినా అనుకున్న స్థాయిలో స్పందన రాలేదని తెలుస్తోంది. గతంలో దరఖాస్తులు చేసిన వారిలో కొందరు ఇప్పటికే ప్లాట్లను విక్రయించుకోవడం.. మరికొందరికి ఆర్థిక భారం కావడం తదితర కారణాలతోనే ఎల్‌ఆర్‌ఎస్‌కు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అప్పటి భూమి విలువను బట్టి ఒక్కో లబ్దిదారుడు రూ.10వేల నుంచి రూ.20వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఎల్‌ఆర్‌ఎస్ ఉంటేనే భవిష్యత్తులో ఇంటి నిర్మాణ అనుమతులు, ఇతరాత్ర సౌకర్యాలు కల్పించేందుకు ఆస్కారం ఉంటుంది. కానీ చాలా మంది దరఖాస్తుదారులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ఇటీవల ఎన్నికల కోడ్ కారణంగానూ ఈ ప్రక్రియలో కొంత జాప్యం చోటుచేసుకోగా.. తాజాగా గడువు దగ్గర పడటంతో దరఖాస్తుదారులు మీసేవ కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అధికారులు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేసి దరఖాస్తుదారుల సందేహాలు తీరుస్తున్నారు. మరో రెండు రోజులు ఉన్నప్పటికీ.. ఈ రెండు రోజులు కూడా సెలవులు రావడం ఈ ప్రక్రియకు అవరోధంగా మారింది. దరఖాస్తుదారులు ఇప్పుడిప్పుడే ఫీజు చెల్లించేందుకు ముందుకు వస్తుండటంతో ప్రభుత్వం గడువు పొడగిస్తుందనే ప్రచారం జరుగుతోంది. కానీ ఇప్పటి వరకు అధికారికంగా ఎలాంటి సమాచారం రాకపోవడంతో అధికారుల్లోనూ సందిగ్ధం నెలకొంది.



మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ సందడి

ఫీజు చెల్లించేందుకు ముందుకొస్తున్నారు : నవీన్, టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్, ఆదిలాబాద్



అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు దరఖాస్తుదారులు ముందుకొస్తున్నారు. ఇప్పటికే చాలా మంది ఫీజు చెల్లించారు. చివరి రోజుల్లో ఈ సంఖ్య పెరిగింది. ఎల్‌ఆర్‌ఎస్ చేసుకున్న వారికి నలుగైదు రోజుల్లో ప్రొసిడింగ్ కాపీలు అందిస్తాం. ప్రభుత్వం గడువు పెంచే విషయం ఇంకా మా దృష్టికి రాలేదు.

మే 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి
- సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ కార్మిక వర్గాన్ని కోరారు. శనివారం సీఐటీయూ కార్యాలయంలో జిల్లా స్థాయి సమ్మె సన్నాహక సమావేశంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. కార్మికులందరికీ కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలను నిలిపివేయాలని, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న చేపడుతున్న అఖిలభారత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బీజేపీ 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే దేశ కార్మిక వర్గం అనేక పోరాటాలు, త్యాగాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా సవరణలు చేస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిందన్నారు. దేశ కార్మిక వర్గం సాధించుకున్న హక్కులు చట్టాలను నిర్వీర్యం చేస్తూ, కార్మిక ద్రోహానికి పాల్పడిందన్నారు. మరోవైపు ఏ ఒక్క ప్రభుత్వ రంగ సంస్థను ప్రారంభించకపోగా, ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిలో వాటాలను విక్రయిస్తూ కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణ చేస్తోందని, నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో ప్రయివేటీకరణను మరింత వేగవంతం చేసిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్న కార్మిక ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను దూరం చేసిందన్నారు. ఆశాలు, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, మెడికల్ అండ్ హెల్త్, మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులు, ఐకేపీ వీఓఏలు ఇతర రంగాల కార్మికులు దేశ వ్యాప్తంగా కనీస వేతనాల కోసం ఉద్యోగ భద్రత, పెన్షన్, ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాల కోసం పోరాటాల నిర్వహిస్తుంటే, మరోవైపు కేంద్ర ప్రభుత్వం సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె చేసే హక్కును, దూరం చేసి 12 గంటల పని దినాన్ని చట్టబద్ధం చేసి, కార్మికులను దోచుకునేందుకు చట్టాలలో మార్పులు చేసిందన్నారు. కార్మికవర్గం సమ్మెలో అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, ఉపాధ్యక్షులు దర్శనాల మల్లేష్, లింగాల చిన్నన్న, అగ్గిమల్ల స్వామి, సహాయ కార్యదర్శులు నవీన్ కుమార్, డి.వెంకటమ్మ, నక్క లక్ష్మణ్, నాయకులు ఆర్.సురేందర్, పండుగ పొచ్చన్న, దర్శనాల నగేష్, ఎ.సంతోష్, అశోక్, సంగీత పాల్గొన్నారు.



నిర్మల్‌టౌన్ : మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. శనివారం టీఎన్జీవో భవనంలో సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాల్ టోల్‌ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికుల పాత వేతనాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఏప్రిల్ 1 నుంచి సమ్మెకు వెళ్తామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను రద్దు చేయాలని కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20న చేపడుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, కోశాధికారి బి.లలిత, జిల్లా సహాయ కార్యదర్శి కె.రాధ, జిల్లా కమిటీ సభ్యులు చంద్రకళ, రమేష్, ప్రసాద పాల్గొన్నారు.



విశ్వావసు - స్వాగతం

అనంత విశ్వవేదిక నుంచి
అష్టవసువులు వెంట తోడ్కొని
చైత్రరథముపై ఊరేగుతూవస్తున్న
విశ్వావసు! స్వాగతం!! సుస్వాగతం!!!.
వసుంధరకు వసంత శోభనిచ్చి
చిరకాలము స్థిరత్వము నివ్వ
పాడి పంటల పసిడి రాసులు నింప
పశుపాలకుల బలమును పెంచ
నిండు పున్నమి వెన్నెల పుసరింప
వరణుడు వరాల వర్షం వర్షించేటట్లు
భూమాతను సుసంపన్నంజేయ వస్తున్నావా!
గెలుపోటములు, జయాపజయములు సరిజేసి
ఆదాయవ్యయాల అంతరాలు తొలగించి
రాజపూజ్యం, మానావ మానాల మర్మం దెలిపి
రాశిఫలాల రంగురూపును విడమర్చి
కృషీవలుడి కృషికి ఫలితం పెంచ
రైతెప్పటికీ రిజేనని నిరూపించ
రాజమార్గాన రంజింపవస్తున్నావా!
శ్రమజీవులు స్వేదానికి విలువను పెంచి
బడుగు బలహీన వర్గాలకు భరోసా కల్పించి
భారమైన జీవితాలకు బాసటగా నిలిచి
ఉచితాలకు ఉరితాడు వేసి
కష్టపడేవాళ్లకి ఇష్టమైన నేస్తంగా
బతుకు బాటకు రంగులద్ద
హామీపత్రాల అడ్రస్సుతో వస్తున్నావా!.
విశ్వవేదికపై విజయాలనందించ
విజయ దరహాసంతో వస్తున్న నీకు
మోదుగ పూగుత్తులతో స్వాగతం

రచన

చిందం ఆశన్న కవి, రచయిత, ఆదిలాబాద్.
సెల్ : 9948030744

నియంతృత్వ పోకడలతో దేశం భ్రష్టు

- రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డ్ చైర్మన్ జనక్ ప్రసాద్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బీజేపీ సర్కార్ మతపరమైన రాజకీయాలతో నియంతృత్వ పోకడలతో దేశాన్ని భ్రష్టు పట్టిస్తోందని రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డ్ చైర్మన్, జైబాపు జైభీం జైసంవిధాన్ ఇన్‌చార్జి జనక్ ప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన జైబాపు జైభీం జైసంవిధాన్ జిల్లా సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు. కాంగ్రెస్ స్వాతంత్ర్యం కోసం ఆవిర్భవించిన పార్టీ అయితే బీజేపీ కేవలం మతపరమైన పార్టీ అని అన్నారు. అభివృద్ధిని మరిచి మతాన్ని అడ్డం పెట్టుకుని ఓట్లు అడగడమే నైజంగా దేశాన్ని పాలిస్తున్న పార్టీ అని విమర్శించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోందని, దాన్ని అడ్డుకుని తీరాలన్నారు. బీజేపీ కబంధహస్తాల కింద దేశం నలిగి పోకుండా కాపాడటం కోసం రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా రాహుల్ గాంధీ చేపట్టిన జై బాపు జై భీం జై సంవిధాన్ నినాదంతో ప్రతిఒక్కరం ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. భారతీయ సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర గాంధీ కుటుంబానిది అన్నారు. సమసమాజ నిర్మాణం కోసం రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు నాలుగు వేల కిలోమీటర్ల యాత్ర చేపట్టారని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన పార్టీ కాంగ్రెస్ అని, అలాంటి పార్టీ బలోపేతం కోసం ప్రతీ నాయకుడు కార్యకర్త పని చేయలని సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సుపరిపాలన సాగుతోందన్నారు. అనంతరం అందరితో జైబాపు జై భీం జైసంవిధాన్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ దుర్గం భాస్కర్, ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్, ఆత్రం సుగుణ, బోథ్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఆడె గజేందర్, నాయకులు దిగంబర్‌రావు పాటిల్, గోక గణేష్‌రెడ్డి, కంది మౌనారెడ్డి, గుడిపల్లి నగేష్, మునిగెల నర్సింగ్, అల్లూరి అశోక్‌రెడ్డి, ఫైజుల్లాఖాన్, కొండ గంగాధర్, లోక ప్రవీణ్‌రెడ్డి, పరమేశ్వర్, భూపెల్లి శ్రీధర్, ఆనంద్‌రావు, మాజీ కౌన్సిలర్లు, మహిళా విభాగం నాయకురాళ్లు పాల్గొన్నారు.

పది పరీక్షకు 23 మంది విద్యార్థులు గైర్హాజరు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా వ్యాప్తంగా పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. ఉ.9.30 నుంచి మ.12.30 వరకు పరీక్ష కొనసాగుతోంది. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష



కేంద్రాలకు చేరుకోగా సిబ్బంది వారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్నారు. కాగా శనివారం జరిగిన పరీక్షకు 10,050 మంది విద్యార్థులకు గాను, 10,027 మంది విద్యార్థులు హాజరై 23 మంది గైర్హాజరయ్యారని అధికారులు పేర్కొన్నారు. మళ్లీ వరుసగా మూడు రోజుల పాటు సెలవు రావడంతో చివరి పరీక్ష ఏప్రిల్-2న జరుగనుంది.

ముస్లిములకు రంజాన్ కానుక అందజేత

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఎన్టీఆర్ నగర్‌లో శనివారం ముస్లింలకు రంజాన్ సందర్భంగా వస్త్రాలను కానుకగా అందజేసిన మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు 420 హామీలు, 6 గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయడంలో విఫలమయ్యారని తెలిపారు. తెలంగాణ ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని గుర్తుచేసుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. కేసీఆర్ ప్రజల సంక్షేమం కోసం పని చేసిన వ్యక్తి అని, అన్ని వర్గాల ప్రజలను గౌరవించారని అన్నారు. ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలందరికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట నాయకులు పాల్గొన్నారు.



సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆధునిక సమాజంలో అమాయక ప్రజలను ఎలాగైనా మోసం చేసి డబ్బులు దోచేయాలని దురుద్దేశంతో వివిధ రకాలైన సైబర్ క్రైమ్ జరుగుతుందని దానిని అప్రమత్తంగా, అవగాహన ద్వారా అడ్డుకోవడం సాధ్యమవుతుందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదా సైబర్‌క్రైమ్.గావ్.ఇన్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలియజేశారు. ఎలాంటి నష్టాన్ని అయినా సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అందులో మొబైల్ హ్యాకింగ్, జాబ్ ఫ్రాడ్, స్టాక్ మార్కెటింగ్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, కస్టమర్ కేర్ ఫ్లాగ్, క్రెడిట్ కార్డ్, డెబిట్ కార్డ్ లోన్ ఫ్రాడ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, సోషల్ మీడియా అకౌంట్ హ్యాకింగ్ ఫ్రాడ్ లాంటివి ప్రస్తుత సమాజంలో నిర్వహించబడుతున్నదని వాటిని అప్రమత్తత తోటే నివారించవచ్చని తెలిపారు. సైబర్ జరిగిన వెంటనే మొదటి గంటలోపే (గోల్డెన్ హవర్) ఫిర్యాదు చేసిన ద్వారా స్కామర్ అకౌంట్‌ను ఫ్రీజ్ చేసి డబ్బును రికవరీ చేయడం సులభతరం అవుతుందని పేర్కొన్నారు. పట్టణంలోని ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏడు ఫిర్యాదులు రాగా, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో-1, రూరల్‌లో రెండు, నేరడిగొండ, బేల, ఇంద్రవెల్లి, సిరికొండ, నార్నూర్, బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఒక్కొక్క ఫిర్యాదు వచ్చిందని తెలియజేశారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలకు 1912 టోల్ ఫ్రీ నెంబర్

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించాలన్న లక్ష్యంతో ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తిన 1912 టోల్ ఫ్రీ నెంబర్ సంప్రదించాలని నిర్మల్ సర్కిల్ ఎస్ఈ బి.సుదర్శనం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1912 టోల్ ఫ్రీ నెంబర్ 24/7 అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ నెంబరు కార్పొరేట్ కార్యాలయం నుంచి సేవలు నిర్వహించబడుతున్నాయని అన్నారు. ట్రాన్స్ ఫార్మర్ల ఫేయిల్యూర్లు, విద్యుత్ సరఫరాలో ఏటువంటి ఇబ్బందులు తలెత్తిన, బిల్లులో ఏమైనా హెచ్చుతగ్గులు ఉన్నా, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్, విద్యుత్ మీటర్ల మార్పు, అన్ని రకాల కొత్త సర్వీసుల మంజూరుకు సంబంధించిన పేరు మార్పు, క్యాటగిరి మార్పు, లోడ్ మార్పు తదితర సమస్యల కొరకు ప్రతి ఒక్క వినియోగదారుడు గుర్తుపెట్టుకునేలా టోల్ ఫ్రీ నెంబర్ 1912ను విస్తృతంగా ప్రచారం చేపడుతున్నామని చెప్పారు. అలాగే విద్యుత్ వినియోగదారుడు ముందుగా 1912కు ఫోన్ చేయగానే అట్టి ఫిర్యాదును స్వీకరించి, ఫిర్యాదును నమోదు చేసి, నమోదు తాలూకు సమాచారాన్ని సంబంధిత అధికారికి వెళ్తుంది. అలాగే ఫిర్యాదు దారునికి మెసేజ్ రూపంలో సంబంధిత అధికారికి పంపడం జరుగుతుందని తెలుపుతారు. అట్టి ఫిర్యాదు ఆ అధికారి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటారన్నారు. వచ్చిన ఫిర్యాదులను ఉన్నత స్థాయి అధికారులు సమీక్షను నిర్వహించడం జరుగుతుందన్నారు. వినియోగదారుల ఫిర్యాదులు సత్వర పరిష్కారం కావడానికి టోల్ ఫ్రీ నెంబర్లు ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు .

జిల్లా ప్రజలకు ఉగాది పండుగ శుభాకాంక్షలు : కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా ప్రజలందరికి విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ శుభాకాంక్షలు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. జిల్లా ప్రజలందరికి ఈ నూతన సంవత్సరం బాగా కలిసి రావాలని కోరుకుంటూ తీపి, చేదు కలగలిపినదే జీవితమని పేర్కొన్నారు. కష్టం, సుఖం ఉంటేనే నిజమైన జీవితం, ఆ జీవితంలో ఆనందోత్సావాలని పూయించేందుకు వచ్చిందే ఉగాది అని కొనియాడారు. తీపి, పులుపు, చేదు, వగరు, ఉప్పు కారంతో తయారు చేసిన ఉగాది పచ్చడిలాగే మనిషి జీవితంలో ఎదురయ్యే కష్టాలు, సుఖాలు, ఆనందాలు, బాధలన్నింటికీ ఉగాది పచ్చడి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలందరూ సుఖ, సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వం కళాకారులకు ఉద్యోగాలు కల్పించాలి

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

ప్రభుత్వం కళాకారులకు ఉద్యోగాలు కల్పించి, వారిని ఆర్థికంగా ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ నిరుద్యోగ కళాకారుల వేదిక నిర్మల్ జిల్లా ఇన్‌చార్జీ వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కళాకారులకు గత ప్రభుత్వం 550 ఉద్యోగాలను భర్తీ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలప్పుడు ఇచ్చిన మాట ప్రకారం 1000 ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. అలాగే శాసనసభ, శాసనమండలిలో కళాకారులకు న్యాయం జరగాలని వారి బాధలను వివరించిన సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మెదక్ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డిలకు ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు నేమరి సాయిరాజ్, మొగిలి మమత, కోరుట్ల రాజేశ్వర్, బిర్కుల సురేష్, కొమ్ముజి స్వామి, టేకులపల్లి భోజన్న, నాగిల్ల రాజేందర్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రజా సేవ కేంద్రం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, జైనథ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ విలాస్ పటేల్‌లు కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజా సేవ కేంద్రం వ్యవస్థాపకులు గట్ల రవి మాట్లాడుతూ వేసవి ఎండల దృష్ట్యా ప్రయాణికుల సౌకర్యార్థం దాహం తీర్చేందుకు వీలుగా ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాగా ప్రయాణికుల కోసం దాహార్తి తీర్చడానికి చలివేంద్ర ఏర్పాటు చేయడం పట్ల పలువురు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు విఠల్ దేవతాడే, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నానాజీ పాటిల్, అవినాష్ గోడే పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-సారంగాపూర్

నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఇటీవల అధ్యక్షుడిగా ఎన్నికైన అల్లూరి మల్లారెడ్డి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ వంశీ కృష్ణ ఎన్నికైన సందర్భంగా శనివారం సారంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు భూమారెడ్డి, వెంకట రమణారెడ్డి, సత్యంలు వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

నిర్మల్‌టౌన్ :నిర్మల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా తొమ్మిదవ సారి ఎన్నికైనటువంటి అల్లూరి మల్లారెడ్డిని శనివారం ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు సయ్యద్ హైదర్ పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అబ్దుల్ సాధిక్, జహీర్ అహ్మద్ పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేదు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- ప్రభుత్వ రాయితీ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కు పాదం



రాయితీ బియ్యం లోడుతో వెళుతున్న లారీని పట్టుకున్న ఇచ్చోడ పోలీసులు

నవతెలంగణ-ఇచ్చోడ


ప్రభుత్వ రాయితీ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపుతామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్రభుత్వ రాయితీ బియ్యం 290 క్వింటాళ్ల లోడు గల లారీని పట్టుకున్న పోలీసులను అభినందించారు. ఈ సందర్భంగా శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో వారం రోజుల వ్యవధిలో 600 క్వింటాళ్ల రాయితీ బియ్యాన్ని స్వాధీనం చేసుకోగా, అందులో 580 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యం ఇచ్చోడ మండల కేంద్రంలో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిందితులపై తగు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జిల్లాలో ఆసాంఘిక కార్యకలాపాలకు తావు లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్సై తిరుపతికి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఇచ్చోడ మండల కేంద్రంలో బోధన్ నుంచి ఆదిలాబాద్ వస్తున్న లారీని (టీఎస్ 01 యూసీ 7019) తనిఖీ చేయగా అందులో 290 క్వింటాళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యం లభించిందని తెలిపారు. డ్రైవర్ సిడం మోతిరామ్ జైనథ్ మండలానికి సంబంధించిన వ్యక్తిపై క్రైమ్ నెంబర్ 85/2025తో అండర్ సెక్షన్ 318(4) 112 బిఎన్ఎస్, సెక్షన్ 7, సెక్షన్ 17(సీ) ఆఫ్ టీఎస్పీడీఎస్ కంట్రోల్ ఆర్డర్ 2016 ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కేసులో సోమవారం స్వాధీనం చేసుకున్న 290 క్వింటాళ్ల రాయితీ బియ్యం కేసులో కీలకంగా ఉన్న ఇద్దరు వ్యక్తుల వివరాలు.. వి.వెంకటరాజు తండ్రి సీతారామరాజు, సీతారామరాజు రైస్ మిల్ ఓనర్, ఆదర్శనగర్ ఆదిలాబాద్. ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని కొనుగోలు చేసే వ్యక్తి. క్షైపు ప్రభాకర్ రెడ్డి తండ్రి అంజిరెడ్డి, బోధన్. ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని సరఫరా చేసే వ్యక్తి. ముగ్గురిపై ఇచ్చోడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా సోమవారం స్వాధీనం చేసుకున్న 290 క్వింటల రాయితీ బియ్యం తరలిస్తున్న వాహన డ్రైవర్ వివరాలు మహమ్మద్ యూసఫ్ అహ్మద్ తండ్రి ఖాలిక్, కైలాస్ నగర్ ఆదిలాబాద్ అని తెలిపారు. అక్రమ రవాణా, ఆసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ వీటిని అరికట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ రాయితీ బియ్యాన్ని పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన ఇచ్చోడ పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

బంజారాలకు హోంమంత్రి పదవి ఇవ్వాలి

- ఎల్‌హెచ్‌పీఎస్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ చౌహాన్

నవతెలంగాణ-నార్నూర్

బంజారాలకు హోంమంత్రి పదవి ఇవ్వాలని లంబాడి హక్కుల పోరాట సమితి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్ చౌహాన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో బంజార నాయకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గోరు బోలీ భాషను అసెంబ్లీలో తీర్మానం చేసి చేతులు దులుపుకుంటామంటే కుదరదని బంజారాల మాతృభాష గోర్ బోలి భాషను 8వ షెడ్యూల్లో చేర్పించడానికి సహకరించిన బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ(ఎం), ఏంఐఏం పార్టీలతో పాటు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతమున్న మంత్రివర్గంలో ఓసీ కాస్ట్ వారే ఎక్కువ మంది ఉన్నారని తెలిపారు. 40 లక్షల జనాభా ఉన్న బంజారాలకు మంత్రి పదవి ఇవ్వకపోతే బంజారా ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. నూతనంగా నియమింపబడ్డ బంజారా భజన్ మండలి జిల్లా గౌరవాధ్యక్షులు ఆడే దిగంబర్, అధ్యక్షులు రాథోడ్ పరశురాం నాయక్‌ను శాలువాతో



సమావేశంలో మాట్లాడుతున్న భరత్ చౌహాన్

సన్మానం చేశారు. కార్యక్రమంలో బంజార నాయకులు ఆడే సురేష్, మాజీ సర్పంచులు రాథోడ్ విష్ణు, రాథోడ్ ధర్మానాయక్, చౌహాన్ యశ్వంత్‌రావు, చవాన్ మహేందర్, జాదవ్ బాలాజీ, చవాన్ బిక్కు, రాథోడ్ ఫకీరా నాయక్, రాథోడ్ దిలీప్, అశోక్, ఆడే వసంత్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పశువులపాక దగ్ధం

- రూ.1.20లక్షల వరకు నష్టం




దగ్ధమైన పశువుల పాకను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారలు

నవతెలంగాణ-కుభీర్

అగ్ని ప్రమాదంలో పశువుల పాక దగ్ధమైన సంఘటన శనివారం మండలంలోని దార్ కుభీర్ గ్రామ శివారు ప్రాంతంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, రైతులు తెలపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన మంగి తుకారాం రైతుకు సంబంధించిన పశువుల పాక దగ్ధమైంది. ఈ అగ్ని ప్రమాదం సమయంలో పశువుల పాకలో పశువులు లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ మంగి తుకారాం రైతుకు సంబంధించిన వ్యవసాయనికి అవసరమైన పనిముట్లు, కాలిపోయాయి. పశువుల పాకకు ఉన్న 60రేకులు ఒక్కొక్క రేకుకు వెయ్యి చొప్పున రూ.60వేలు, పశువులకు మేతకు రూ.20వేలు వ్యవసాయ పనిముట్లుకు రూ.40వేల వరకు మొత్తం దాదాపుగా రూ.1లక్ష 20వేల వరకు రైతుకు నష్టం జరిగినట్లు మండల రెవెన్యూ అధికారులు అంచనా వేశారు. ఈ నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు అందించి రైతుకు నష్టపరిహారం అందేలా చూస్తామని రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగిన విషయం అగ్ని మాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలి

- డీఈఓ పి.రామారావు



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

పదో తరగతి పరీక్షలు శనివారం జీవ శాస్త్ర పరీక్ష గురించి సెట్ కాన్ఫరెన్స్‌లో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్స్‌తో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, జిల్లా పరిశీలకులు టి.శ్రీనివాస్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారుల బృందంతో కలిసి మాట్లాడారు. పొరపాట్లు లేకుండా నిబంధనల ప్రకారం పరీక్షలు నిర్వహించాలని సూచించారు అనంతరం నిర్మల్‌లోని చాణక్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించి అక్కడి సీఎస్, డీఓలకు పలు సూచనలు చేశారు. కాపీయింగ్ జరుగకుండా అందరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. అదేవిధంగా జాగ్రత్తగా జవాబు పత్రాలను పోస్ట్ ఆఫీస్‌లో సరియైన విధంగా పోస్ట్ చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా జీవ శాస్త్ర పరీక్షలో రెగ్యులర్ విద్యార్థులు 9,129కు గాను, 9,118 మంది హాజరయ్యారని, 11 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ప్రవీణ్ మరణం మిస్టరీ తేల్చాలి

నవతెలంగాణ-ఉట్నూర్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి సమీపంలో గత 20న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ మిస్టరీని ప్రభుత్వం తేల్చాలని ఉట్నూర్ డివిజన్ పాస్టర్ అసోసియేషన్, క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షులు డానియల్, ప్రధాన కార్యదర్శి జోసెఫ్‌లు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రెస్‌భవన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రవీణ్ మరణం క్రైస్తవ లోకానికి తీరని లోటని అన్నారు. రోడ్డు ప్రమాదంలో చనిపోయాడని ఒకరు, హత్య జరిగిందంటూ ఇంకొకరు రకరకాల కారణాలు చెబుతున్నందున ప్రభుత్వం పోస్టుమార్టం నివేదిక అనుసరించి ప్రవీణ్ ఎలా మృతి చెందాడో తేల్చాలన్నారు. ఉభయ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, దేశ ప్రధానమంత్రి ఈ విషయంలో జోక్యం చేసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. క్రైస్తవులకు ప్రభుత్వాలు అండగా ఉండాలని,



మానవ విలువలు, సమన్యాయం కాపాడాలని అన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి సునీల్ కుమార్, సలహాదారు రాజారత్నం, సభ్యులు ఏసుబాబు, దయాకర్ ఉన్నారు.

ఘనంగా జై సంవిధాన్ కార్యక్రమం



నవతెలంగాణ-ఉట్నూర్

పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంపల్లి చంద్రయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా మోడీ ప్రభుత్వం రాజ్యంగం మార్చాలనే కుట్రలో భాగంగా, బడుగు బలహీనవర్గాలను అణిచివేసే ప్రయత్నాలు చేస్తోందని, అమిత్‌షా పార్లమెంటులో దళితులను కించపరిచే విధంగా మాట్లాడారని అన్నారు. అయిన బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. జైబాపు, జైభీం, జైసంవిధాన్ అనే కార్యక్రమం ద్వారా బీజేపీ చేస్తున్నటువంటి కుట్రలను ప్రజలకు వివరిస్తూ ప్రజలను చైతన్యం చేసే అవసరం ఎంతైనా ఉందని, రాబోయే రోజుల్లో బీజేపీని పాతాళంలోకి తొక్కి, రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేసి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ దూట రాజేశ్వర్, మండల అధ్యక్షులు ఖయ్యూమ్, బిరుదుల లాజర్, కోడి ప్రభాకర్, మర్సుకోల తిరుపతి, నందం, మహిళా నాయకురాలు కళావతి, రాజమణి, కలీం, భాస్కర్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం..కాపాడిన పోలీసులు

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

నారి శక్తి ప్రోగ్రాంలో భాగంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ప్రతీ శనివారం ప్రత్యేకంగా పెట్రోకార్ విధులు నిర్వర్తిస్తున్న నిర్మల్ గ్రామీణ పోలీసులు రజిత, శ్రావణికలు వీరితో పాటు కానిస్టేబుల్ సంతోష్ తమ విధి నిర్వహణలో భాగంగా చిట్యాల్ వంతెనపై పెట్రోలింగ్ చేస్తుండగా వంతెనపై మనస్తాపానికి గురై ఒంటరిగా సంచరిస్తున్న బి.శ్రీకాంత్(32) తండ్రి పేరు మల్లయ్య అనే వ్యక్తి చిట్యాల్ వంతెన వద్ద ఆత్మహత్యాయత్నం చేయగా తక్షణమే స్పందించి అతన్ని కాపాడి బంధువులకు అప్పగించినట్టు కానిస్టేబుల్ సంతోష్ తెలిపారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఇచ్చోడ

గుర్తు తెలియని పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సల్యాదా గ్రామంలో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్న సల్యాదా గ్రామానికి చెందిన కె.లక్ష్మణ్(40), గత కొన్ని రోజులు నుంచి మద్యం తాగుతూ ఎటువంటి పనిచేయకుండా, ఇంటివద్దే ఉంటున్నాడు. జీవితంపై విరక్తి చెంది శనివారం తెల్లవారు జామున గుర్తుతెలియని పురుగులమందు తాగి, ఇంటి వద్ద వాంతులు చేసుకుంటూ ఉండగా భార్య లక్ష్మీ చూసి ఏమి జరిగిందని అడుగగా, మృతుడు పురుగులమందు తాగినట్లు తెలుపగా వెంటనే 108 అంబులెన్స్‌లో రిమ్స్ ఉదయం 6:30కు తరలించగా చికిత్స పొందుతూ లక్ష్మణ్ చనిపోయినట్టు వైద్యులు తెలిపారు. మృతునికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలం కడ్తాల్ గ్రామానికి చెందిన కొండ్ర రాంరెడ్డి(37) శుక్రవారం రాత్రి తన పంట చేను నుంచి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా 44వ జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం బైక్‌ను వేగంగా ఢీకొనడంతో కొండ్ర రాంరెడ్డి తలకు బలమైన గాయం కావడంతో వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతన్ని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ముస్లిం కుటుంబాలకు రంజాన్ సరుకుల పంపిణీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేద ముస్లిం కుటుంబాలు కూడా రంజాన్ పండుగను ఘనంగా జరుపుకోవాలని సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్‌రెడ్డి అన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని శనివారం షాదీఖాన, ఖుర్షీదనగర్, భుక్తాపూర్, న్యూహౌసింగ్ బోర్డు కాలనీ, సుభాష్ నగర్, బంగారుగూడ కాలనీలలో దాదాపు ఐదు, ఆరు వందల మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు తన వంతుగా రంజాన్ సరుకులను పంపిణీ చేశారు. పండుగను సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అజీజ్, షఫీ, ఆశన్న యాదవ్, మోరేష్, జహీర్, సురేందర్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, వైభవ్‌రెడ్డి, అథర్వ, దినేష్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి ఉన్నారు.

వేలం పాట దక్కించుకున్న వారికి సన్మానం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లింగోజీ తండ గ్రామ పంచాయతీ పరిధిలో డైలీ మార్కెట్ వేలం పాట శనివారం నిర్వహించారు. ఈ వేలం పాటను ఎ.వీర్ సింగ్ దక్కించుకున్నాడు. వారికి గ్రామ పెద్దలు, గ్రామ యువకులు శాలువాతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి విక్రమ్, ఎస్సీ సెల్ అధ్యక్షులు, ఎస్టీ సెల్ అధ్యక్షులు, పీసా కమిటీ సభ్యులు, వీటీడీ అధ్యక్షులు గ్రామ పెద్దలు నరేష్, తోట సత్తన్న, మాజీ సర్పంచ్ హరి నాయక్, మాజీ ఉప సర్పంచ్ భాస్కర్ పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాకు చెందిన ఎస్సీ విద్యార్థులకు 2025 విద్యా సంవత్సరానికి గాను విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు అంబేద్కర్ ఓవర్సీస్ విద్య నిధి పథకం ద్వారా స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సునీత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో మే 19 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇతర వివరాలకు 8886976630 సెల్ నెంబర్ సంప్రదించాలని కోరారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
4
ఆదివారం | మార్చి 30, 2025 | www.navatelangana.com

సెర్ప్ సిబ్బంది ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో పనిచేస్తున్న సిబ్బంది ధ్రువపత్రాలను అదనపు కలెక్టర్ దీపక్ తివారి గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెర్ప్ సిబ్బంది పుట్టిన తేదీ, పేరు, తండ్రి పేరు, విద్యార్హతలు, ఇతర సంబంధిత ధ్రువపత్రాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. దీనికి సంబంధించి నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈఓ యాదగిరి, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, డీపీఎం ఫైనాన్స్ అన్నాజీ, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయునికి సన్మానం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మండలం బారెగూడ ఎంపీయూపీఎస్‌లో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ పొందుతున్న కొయ్యడ సుభాష్‌గౌడ్‌ను శనివారం పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఏటుకూరి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సుదీర్ఘకాలం ఉపాధ్యాయ వృత్తిలో ఉండి విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పి ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనత సుభాష్‌గౌడ్‌కు దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసోషియేట్ అధ్యక్షులు శ్రావణ్‌కుమార్, మండల అధ్యక్షులు ఎ భిక్షపతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు ఇచ్చిన హామీ నెరవేర్చాలి

- ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లాంటి పథకాలలో పేదలకు ఇచ్చిన హామీ తులం బంగారం హామీని నెరవేర్చాలని ఎమ్మెల్యే కోవలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదింటి ఆడబిడ్డ పెళ్లికి అప్పటి సీఎం కేసీఆర్ ఎంతో ముందు చూపుతో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో పార్టీలకు అతీతంగా అర్హులైన వారికి పథకాలను అందజేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు అదనంగా ఒక తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్న అమలు చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, తహసీల్దార్ రోహిత్, డిప్యూటీ తహసీల్దార్ పోచయ్య, నాయకులు రవీందర్, భీమేష్, శ్రీనివాస్, రహపల్లి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శనివారం కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్‌చౌక్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముందుగా పార్టీ పతాకాన్ని టీడీపీ ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు జి ఆనంద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభివృద్దే ధ్యేయంగా ఎన్టీఆర్ 1982లో పార్టీని స్థాపించారని, నాటి నుండి నేటి వరకు అదే లక్ష్యంతో పార్టీ పనిచేస్తోందని అన్నారు. తెలంగాణలో మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు పార్టీని బలోపేతం చేసే దిశగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లూరి శంకర్, జె దేవేందర్, ఎల్ మధూకర్, ఎలమంచిలి శ్రీనివాస్, సంజీవ్, గులాబ్‌రావు, సత్యనారాయణ, రాజేష్, మక్బుల్, సురేందర్, రాంచందర్ పాల్గొన్నారు.

వారాంతపు సంత వేలం



నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని ఆదివారం నిర్వహించే వారాంతపు సంత వేలం శనివారం పంచాయతీ ప్రత్యేక అధికారి అబ్దుల్ నదీమ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారాం నిర్వహించారు. ఈ వారాంతపు సంత వేలంకు బెజ్జూరు గ్రామానికి చెందిన సామల వెంకటేశం, ఎండీ సిరాజ్, ఎండీ మేరాజ్ హుస్సెన్లు రూ.5000 ధరావత్ చెల్లించి పాల్గొన్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి తుకారం తెలిపారు. ఈ వేలం పాటలో అత్యధికంగా రూ.3,30000 బెజ్జూరు గ్రామానికి చెందిన సామల వెంకటేశం పాటపడి దక్కించుకున్నారు. గత ఏడాది బెజ్జూర్ వారాంతపు సంత రూ.రెండు లక్షల ఇరవై వేలు, కాగా ఈ ఏడాది రూ.మూడు లక్షల 30 వేలకు వారంతా సంత వేలం పలికింది. గతంతో పోల్చితే, గ్రామపంచాయతీకి రూ.లక్ష పదివేల అదనపు ఆదాయం వచ్చింది. ఈ నిధులను గ్రామపంచాయతీ అభివృద్ధికి వినియోగించనున్నట్లు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి అబ్దుల్ నదీమ్ తెలిపారు. కార్యక్రమంలో బెజ్జూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాచకొండ శ్రీ వర్ధన్, కరోబారి వసంత్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయికి టీజీటీడబ్ల్యూయూ బాలికలు



నవతెలంగాణ-జైనూర్

సౌత్‌జోన్ గేమ్స్ నేషనల్ లెవల్ పోటీల్లో టీజీటీడబ్ల్యూయూ(బాలికలు)ల విద్యార్థులు ప్రతిభ చాటి జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శనివారం టీజీటీడబ్ల్యూయూలో పాఠశాల నుండి జూన్ స్థాయికి ఎంపికైన పెందూర్ స్వర్ణ, సిడం అరుణలను కళాశాల పీడీ సునీతతో పాటు ఉపాధ్యాయులు అభినందనించారు. జోనల్ స్థాయిలో కూడా మంచి ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

పోరు గ్రామాల్లోనే తాగునీటి ఇబ్బందులు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారు రవికుమార్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని కుమురం భీం నడయాడిన పోరు గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బండారి రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దుర్గం దినకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మంచినీటి సమస్య చాలా తీవ్రంగా ఉందని దశాబ్దాల క్రితమే కుమురం భీం పోరాడినప్పటి పోరు గ్రామాల్లో సైతం మంచి నీటి సమస్య తీవ్రంగా ఉందని వెంటనే మంచినీటి సౌకర్యం కల్పించడం కోసం తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆదివాసీ గ్రామాల్లో తీవ్రమైన మంచినీటి సమస్య ఉందని, ఆదివాసులు అంటేనే ప్రభుత్వాలకు చిన్న చూపు ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తిర్యాణి మండలం గుండాల, మంగి, మాణిక్యాపూర్ గ్రామాల్లో సమస్య తీవ్రంగా ఉందన్నారు. వాంకిడి మండలం రింగారిట్ గ్రామంలో 30 కుటుంబాలు ఉంటాయని కేవలం ఒక్క బోరు మాత్రమే ఉందన్నారు. అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్న నీళ్లు రావడంలేదని, అలంకారప్రాయంగా ఉన్నాయన్నారు. జోడేఘాట్, బాబేజరి, పాటగూడ గ్రామాల్లో సమస్య ఉందన్నారు. జైనూరు, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాల్లోని అనేక గ్రామాల్లో నీటి సమస్య ఉందని, ఎండలు తీవ్రమవుతున్నాయని కావున యుద్ధ ప్రతిపాదికన నీటి ఎద్దడి నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకి పంట నష్టం వాటిల్లిందని వీటితో పాటు అనేక ఇల్లు కూలిపోయాయని వీటిని వెంటనే సర్వే చేసి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు ముంజం ఆనంద్ కుమార్, గోడిసెల కార్తీక్, కొరెంగా మాల శ్రీ, సీహెచ్ సాయి క్రిష్ణ, గెడం టికానంద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆర్టీఓ లోకేశ్వర్ రావుతో కలిసి జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారుల సమన్వయంతో పటిష్టమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని జాతీయ, ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని, మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణాలు, ప్రధాన రహదారులపై ప్రమాదాలు జరిగే చోట వేగ నియంత్రణలను ఏర్పాటు చేయాలని, మంచిర్యాల నుండి వచ్చే దారిలో ఆసిఫాబాద్ పట్టణ ముఖద్వారం వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని, పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రత నియమాలపై అవగాహన తరగతులు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. ప్రమాదాల నివారణలో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టి విస్తృత స్థాయిలో తనిఖీలు చేయాలని ఆదేశించారు. మైనర్లు వాహనాలు నడపకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, రహదారులపై ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించేలా అంబులెన్స్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించాలని, జాతీయ రహదారికి ఇరువైపులా గ్రామాల్లో సర్వీస్ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం పనులు త్వరగా పూర్తిచేసేలా జాతీయ రహదారుల సంస్థ అధికారులు సంబంధిత అధికారుల సమన్వయంతో కృషి చేయాలన్నారు. జాతీయ రహదారులపై గల డివైడర్లపై నుండి ఎడ్ల బండ్లు, ద్విచక్ర వాహనాలు వెళ్లకుండా చూడాలన్నారు. జిల్లాలో ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి రాంచందర్, ఆర్అండ్‌వీ అధికారి సురేందర్, విద్యుత్ శాఖ ఎస్ఈ శేషరావు, డిపిఓ బిక్షపతి, గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

జిల్లా కళాకారుల అభివద్ధికి తోడ్పాటు అందించాలి

జిల్లాలోని కళాకారులకు టివి, సినీ రంగాలలో అవకాశం కల్పించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారత్ కల్చరల్ అకాడమీ ఓం సాయి తేజ ఆర్ట్స్ సంయుక్త నిర్వహణలో జిల్లాలోని వివిధ రంగాల కళాకారులకు టివి, సినీ రచయితలకు, దర్శకులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని టివి సీరియల్ దర్శకుడు నాగబాల సురేష్ బాబుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కళాకారులకు, క్రీడాకారులకు కొదువ లేదని, కళాకారులు వివిధ రాణిస్తున్నారన్నారు. జిల్లాలో టివి సీరియల్, సినిమా షూటింగ్‌లకు అనువైన ప్రదేశాలు జిల్లాలో చాలా ఉన్నాయని, జిల్లాలో ప్రాచీన దేవాలయాలు, జలపాతాలు, సింగరేణి గనులు, సిర్పూర్ కాగిత పరిశ్రమ, ప్రాణహిత, పెద్దవాగు పరివాహక ప్రాంతాలు, కుమురం భీం ప్రాజెక్టు వంటి సుందరమైన ప్రదేశాలు అనేకం ఉన్నాయని తెలిపారు. ఏ రంగంలోనైనా రాణించాలంటే పట్టుదల, కఠోర శ్రమ ఉంటుందన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టివి సీరియల్ దర్శకులు ప్రేమ్ రాజ్, స్థానికులు డి. రామారావు, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ, రాధాకృష్ణచారి, బిట్టు వెంకటేశ్వర్లు, సునీల్, సంతోష్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు



దివ్యాంగులకు ట్రై సైకిల్ అందిస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు నియోజకవర్గంలోని దివ్యాంగుల సంక్షేమం పట్ల తాను ఎల్లవేళలా కృషి చేస్తానని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. శనివారం నియోజకవర్గంలోని దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, వినికిడి పరికరాలు, హ్యాండ్ స్టిక్స్ తదితర పరికరాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల చిన్న చూపు పోవాలని, సమాజంలో మార్పు రావాలని అన్నారు. తమ జీవితం అయిపోయిందనీ, ఇక తాము ఏమీ చేయలేమనే భావన నుండి దివ్యాంగులు బయటపడాలన్నారు. ఎందరో దివ్యాంగులు నేడు ఉన్నత శిఖరాలలో ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్‌ను రూ. 4 వేల నుండి రూ. 6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో తాను కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అలింకో ప్రతినిధులు ప్రసన్న కుమార్, పట్నాయక్, ఐసీడీఎస్ సూపరింటెండెంట్ పుష్పలత, కాగజ్‌నగర్ సీడీపీఓ రెబెకా, సంక్షేమ శాఖ ఫీల్డ్ రెస్పాన్సిబిలిటీ అధికారి రవికుమార్, దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎండి ఖయ్యూం పాల్గొన్నారు.

30 లక్షల విలువైన పరికరాల పంపిణీ

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సహకారంతో అలింకో సంస్థ రూ. 30 లక్షల విలువైన పరికరాలను శనివారం దివ్యాంగులకు పంపిణీ చేసింది. ఇందులో మోటారైజ్డ్ ట్రై సైకిళ్లు 38, వీల్ చైర్లు 9, హియరింగ్ హెడ్స్ 15, హ్యాండ్ స్టిక్స్ 5, బ్రెయిలీ కేన్స్ 4, ట్రై సైకిళ్లు 11, కాలిపర్స్ 8, ఎల్‌బో క్రచెస్ 5 ఉన్నాయి. ఇందులో 11 ట్రై సైకిళ్లు తయారీ దశలో ఉన్నాయని, వీటిని త్వరలోనే అందిస్తామని అలింకో ప్రతినిధులు తెలిపారు.

విరమణ ఉద్యోగానికే..సేవకు కాదు

నవతెలంగాణ-రెబ్బెన

విరమణ అనేది ఉద్యోగానికే ఉంటుందని సేవకు కాదన్న విషయాన్ని ప్రతి ఒక్కరు గ్రహించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. బెల్లంపల్లి సింగరేణి ఏరియాలోని ఎంవీటీసీ హెడ్ ఓవర్ మెన్‌గా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందుతున్న మల్రాజ్ శ్రీనివాస్ దంపతులను ఏరియాలో టీజీబీకేఎస్ కార్మిక సంఘం నాయకులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమనికి బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై విరమణ పొందుతున్న శ్రీనివాస్ దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బెల్లంపల్లి ఏరియాలో కార్మికులకు ఎనలేని సేవలు అందించారన్నారు. సుదీర్ఘంగా ఎన్నో పోరాటాలు చేసి కార్మికులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటు సమస్యల పరిష్కరం కోసం కృషి చేశారన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి బీఆర్ఎస్‌లో ఎన్నో ఉద్యమ సేవలు అందించి కొత్తగా యూనియన్ ఏర్పినప్పుడు శ్రీనివాసరావు దాన్ని బలోపేతం చేసి గుర్తింపు ఎన్నికల్లో గెలుపుకు కృషి చేశారని కొనియాడారు. శ్రీనివాస్ శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. నాయకులు పాల్గొన్నారు.



శ్రీనివాస్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలుర, బాలికల పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో పాటు భోజనం చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాలల సంరక్షణ చట్టాలున్నాయని వాటిపై విద్యార్థి దశ నుండి వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు తమకు ఏమైనా ఇబ్బందులు వస్తే 15100 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఎటువంటి న్యాయపరమైన సలహా అవసరమైన తమను సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైలు సందర్శన

జిల్లా కేంద్రంలోని జనకాపూర్ సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి యువరాజ సందర్శించారు. ఈ సందర్భంగా ఖైదీలతో మాట్లాడుతూ ఎవరైనా లాయర్‌ను నియమించుకోలేని పరిస్థితుల్లో ఉంటే నేరుగా తమకు తెలియజేయాలని, ప్రభుత్వ లాయర్‌ను నియమించడం జరుగుతుందన్నారు. న్యాయ సలహాలు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. జైలు జీవితం నేర ప్రవృత్తిని తగ్గించేదిగా ఉండాలని, ఖైదీలు తమ నడవడికను మార్చుకొని ప్రవర్తనలో మార్పు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్, కోర్టు సిబ్బంది అంజనీ దేవి, అడ్వకేట్లు నరహరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేందుకే చలి వేంద్రాలు



నవతెలంగాణ-కెరమెరి

పాదాచారుల దాహార్తిని తీర్చేందుకే చలి వేంద్రాల ఏర్పాటు చేశామని ఎంపీడీఓ అంజత్ పాషా అన్నారు. శనివారం మండలంలోని ఝరి, కోఠారి బస్టాండ్ వద్ద చలి వేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజురోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వివిధ అవసరాల నిమిత్తం బయటకు వెళ్లిన సమయంలో దాహార్తిని తీర్చుకునేందుకు చలి వేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలో రద్దీ ఎక్కువగా ఉన్న చోట చలి వేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. సమాజ సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్ రావు పాల్గొన్నారు.

విశ్వావసు నామసంవత్సర పంచాంగం ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విశ్వావసునామ సంవత్సర పంచాంగాన్ని ధూప దీప నైవేద్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ శర్మ, జిల్లా అధ్యక్షుడు ఒజ్జల శిరీష్ శర్మ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న సంవత్సరంలో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు విజయ్ కుమార్, సతీశ్, శ్రీధర్, వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు

జిల్లా కేంద్రంలో విశ్వబ్రాహ్మణులు తమ ఇండ్లలో శ్రీ విశ్వవసు నామ సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలుకుతూ శనివారం అమావాస్య నాడు ఉగాదికి ప్రత్యేక పూజలు చేశారు. పూజ గదిని గోగుపులు, తీగదరి పూలతో ప్రత్యేకంగా అలంకరించి కులవృత్తుల పరికరాలను పూజించారు.

ఏప్రిల్ ఒకటి నుండి సన్న బియ్యం పంపిణీ

నవతెలంగాణ-వాంకిడి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఏప్రిల్ ఒకటో తేదీ నుండి మండలంలోపంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ మహమ్మద్ రియాజ్ అలీ తెలిపారు. ప్రతి ఒక కార్డుదారునికి ఆరు కిలోల చొప్పున బియ్యం ఇవ్వడం జరుగుతుందని, మండలంలోని డీలర్లు ప్రతి కార్డుదారునికి బియ్యం అందే విధంగా చూడాలన్నారు. డీలర్లు తప్పనిసరిగా కార్డుదారులకు ఒకటో తేదీ నుండి సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆదేశించారు.

హెల్త్ కార్డు దరఖాస్తు గడువు పొడిగింపు

రెబ్బెన : ఉద్యోగ విరమణ పొంది ఇప్పటి వరకు (సీపీఆర్ఎంఎస్) హెల్త్ కార్డు లేని విశ్రాంత ఉద్యోగులకు దరఖాస్తు చేసుకొనేందుకు యాజమాన్యం మరో అవకాశం కల్పించిందని అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మార్చి 31వ తేదీ వరకు దరఖాస్తు గడువు ఇచ్చారన్నారు. కాగా ప్రస్తుతం ఏప్రిల్ 15వ వరకు గడువు పొడిగించినట్లు చెప్పారు. విశ్రాంత ఉద్యోగులు సంబందిత గనులు, విభాగాల్లో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజం

● అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్

నవతెలంగాణ-నస్పూర్



ప్రజలతో మమేకమై సేవలు అందించే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో ఉప గణాంక అధికారిగా పని చేస్తూ ఈ నెల 31న ఉద్యోగ విరమణ పొందుతున్న నేపథ్యంలో అడ్లూరి రామకృష్ణమూర్తి దంపతులను ముఖ్య ప్రణాళిక అధికారి జి సత్యంతో కలిసి శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ ముఖ్య ప్రణాళిక అధికారులు కష్టయ్య, రవీందర్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్‌లో ఎన్నికవ్వడం అభినందనీయం

నవతెలంగాణ-లక్సెట్టిపేట



మండలంలోని గుల్లకోట గ్రామానికి చెందిన ఆవునూరి సత్తయ్య జిల్లా బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికవ్వడం అభినందనీయమని మాదిగ హక్కుల దండోరా జిల్లా అధ్యక్షుడు లింగంపల్లి వెంకటేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ మీరు అమ్మ వారసత్వం పుచ్చుకొని ఇంకా మరెన్నో పదవులకు వన్నె తెచ్చేలా ఎదగాలని కోరుకుంటూ మాదిగ జాతి ఆణిముత్యం పేరు ప్రఖ్యాతలు సంపాదించి సమాజ సేవలో ఉండాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహం, లైబ్రరీ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

ఎస్టీపీపీ పవర్ ప్లాంట్‌లో అంబేద్కర్ విగ్రహం, లైబ్రరీ ఏర్పాటు చేయాలని సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సెక్రటరీ ఆన్తోటి నాగేశ్వరరావు దరావత్ పంతుల కోరారు. శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ మెంబర్స్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు ఇవ్వాలని, ఏప్రిల్ 14 అంబేద్కర్ జయంతి సందర్భంగా విగ్రహం ఏర్పాటు రూ.ఒక లక్ష నుంచి రూ.లక్ష యాభై వరకు పెంచాలని కోరారు. అలాగే జైపూర్ ప్లాంట్ ఎస్టీపీ ఆధ్వర్యంలో లైబ్రరీ ఏర్పాటు చేయాలని, 59 జీఓ అమలు చేస్తే ఎస్సీ ఎస్టీ సోదరులకు సుమారు రూ.కోటి కాంట్రాక్టు వర్క్స్ లభిస్తుందన్నారు. భూములు కోల్పోయిన సోదరులకు కాంట్రాక్ట్ వర్క్స్ ద్వారా ఫిట్టర్, క్లర్క్ శిక్షణ తరగతులు నిర్వహించి సూటబుల్ ప్లేస్మెంట్ జాబ్ ఇయ్యాలని, దీనివలన చాలామందికి అవకాశాలు వస్తాయని తెలిపారు. శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియంకు జ్యోతిరావు పూలే ప్రగతి స్టేడియంగా నామకరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ దేగల ప్రవీణ్ కుమార్, బ్రాంచ్ సెక్రెటరీలు అందె వెంకటేష్, నక్క సుమన్, రెడపాక లక్ష్మి, అడ్వైజర్ గుణగంటి నర్సింగరావు, జాయింట్ సెక్రెటరీ ఎర్రావుల శంకర్ పాల్గొన్నారు.

ఏఐసీడబ్ల్యూఎఫ్ సమావేశంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ నాయకులు



నవతెలంగాణ-నస్పూర్

ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో మూడు రోజులపాటు నిర్వహించనున్న 11వ ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐసీడబ్ల్యూఎఫ్) సమావేశానికి సింగరేణి శ్రీరాంపూర్ బ్రాంచ్ నుంచి సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (బిసీఐటీయూ) రాష్ట్ర కమిటీ ప్రతినిధులుగా శ్రీరాంపూర్ నుంచి గుల్ల బాలాజీ, అంబాల శ్రీనివాస్, వెంగళ శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్ పాల్గొన్నారు. కోల్ ఇండియాలో అమలవుతున్న సర్క్యులర్లు సింగరేణిలో అమలు చేయకపోవడంపై చర్చించడం, సింగరేణి బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని, సొంతింటి పథకం, ఇటీవల జరుగుతున్న నాచురల్ డెత్‌కు బ్యాంకు ఇచ్చే ఇన్సూరెన్స్ వర్తింపు లాంటి అంశాలపై చర్చించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కాలోరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) సింగరేణిలో చేస్తున్నటువంటి పోరాటాల గురించి నివేదికను ఇచ్చామన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-లక్సెట్టిపేట

పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్ మొదటి వార్షికోత్సవ వేడుకలు శనివారం స్థానిక ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు, మండల విద్యాశాఖ అధికారి హెలెన్ దారతి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటా, పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యతో పాటు, నైతిక విలువలు కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ కళా నాయర్ మాట్లాడుతు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మారుతున్న విద్యార్థుల మనస్తత్వాలను జాగృత పరిచే దిశగా సెలబ్రేషన్స్ నిర్వహించామని తెలిపారు. ఈ క్రమంలో చదువు, ఆటలు, సాంస్కృతిక కళలో విద్యార్థులు సాధించిన విజయాలపై వార్షిక నివేదికను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్స్ అందజేశారు.

రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని నిరసన

నవతెలంగాణ-కాసిపేట



మండల కేంద్రంతో పాటు మందమర్రి ఏరియాలోని కాసిపేట-1 ఇన్‌క్లైన్-2 బొగ్గు గనులకు వెళ్లే రహదారి మరమ్మత్తులు చేపట్టాని రోడ్డుపై కార్మికులు నిరసన వ్యక్తం చేసి ధర్నా చేశారు. దుబ్బగూడెం గ్రామం నుంచి కాసిపేట వరకు రోడ్డు ధ్వంసమై గుంతలు పడి రహదారిపై ప్రజలు, సింగరేణి కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని మండి పడ్డారు. ఇప్పటికే ఇద్దరు కార్మికులు గుంతలో పడి ప్రమాదాలకు గురయ్యారన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు, స్థానిక శాసన సభ్యులు, సింగరేణి యాజమాన్యం, మందమర్రి జీఎం స్పందించి వెంటనే ఈ రోడ్డును మరమ్మత్తులు చేసి ప్రజల, కార్మికుల క్షేమానికి కృషి ఏఐటీయూసీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, మీనుగు లక్ష్మీనారాయణ, ఎస్ నాగేశ్వరరావు, సంపత్, సతీష్ కుమార్, కొండపల్లి నర్సయ్య పాల్గొన్నారు..

పెరిగిన పెన్షన్ సెటిల్మెంట్ ఫలితమేదీ..?

● 11వ వేతన ఒప్పంద బకాయిల కోసం ఎదురు చూపు ● ఆందోళనలో సింగరేణి రిటైర్డ్ కార్మికులు

నవతెలంగాణ-జైపూర్

11వ వేతన ఒప్పందం పరిధిలో పదవీ విరమణ పొందిన కార్మికులకు సంబంధించిన కొత్తగా పెరిగిన పెన్షన్ సెటిల్మెంట్ చేసిన ఫలితం లేకుండా పోయింది. పెన్షన్ సెటిల్మెంట్ చేసిన కార్మికులకు సబంధించిన నగదు లావాదేవీలు బ్యాంకు ఖాతాల్లో జమ చేయకపోవడంతో రిటైర్డ్ కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొక తప్పడం లేదు. ఈ విషయంలో సంబంధిత గనుల వద్ద ఎలాంటి సమాదానం లేకుండా పోయిందని రిటైర్డ్ కార్మికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. సుధీర్ఘ కాలం సింగరేణిలో పని చేసి పదవీ విరమణ పొందిన కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. 2021-2023 మధ్య 11వ వేతన ఒప్పందంలో దాదాపుగా 4 వేలకుపైగా కార్మికులు పదవీ విరమణ పొందారు. కొంత మందికి సంబంధించిన పెన్షన్ కాగితాలతో పాటు సదరు కార్మికుడు అతని భార్యతో కలిసి దిగిన ఫోటోలు వారు పని చేసిన చోట అప్పగించారు. అదే విధంగా సీఎంపీఎఫ్ కార్యాలయం నిబంధనల మేరకు అన్ని డాకుమెంట్లు పంపిస్తే సరిపోతుందంటున్న గని అధికారులు పెన్షన్ సెటిల్మెంట్‌లో జాప్యంపై స్పందించడం లేదు. పదవీ విరమణ పొందిన కార్మికుల పెన్షన్ సెటిల్మెంట్ చేయించాల్సిన బాధ్యత సింగరేణి అధికారులపై లేదా అనే ప్రశ్న తలెత్తుతోంది. పెన్షన్ సెటిల్మెంట్‌కు మాకు ఎలాంటి సంబంధం లేదన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారని బాదితులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

1629 మందికి పెన్షన్ సెటిల్మెంట్

11వ వేతన ఒప్పందం ప్రకారం పదవీ విరమణ పొందిన వారిలో గోదావరిఖని సీఎంపీఎఫ్ పరిధికి చెందిన 1629మందికి పెన్షన్ సెటిల్మెంట్ అయింది. కాని పెరిగిన కొత్త పెన్షన్, బకాయిల డబ్బులు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఎవరికి పెన్షన్ సెటిల్మెంట్ అయిందో తెలుసుకోవాలనుకునే కార్మికులకు అధికారులు స్పష్టత ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెన్షన్ సెటిల్మెంట్ అయిన కార్మికుల వివరాలు సంబంధిత గనుల వద్ద ప్రచూరించాలని, పెన్షన్ సెటిల్మెంట్ కానటువంటి వారికి వెంటనే సెటిల్మెంట్ అయ్యే విధంగా గని అధికారులు, ఏరియా జీఎంలు చర్యలు తీసుకోవాలని రిటైర్డ్ కార్మికులు కోరుతున్నారు.

పెన్షన్ పే ఆర్డర్లలో తప్పులు

సింగరేణి వ్యాప్తంగా 10వ వేజ్‌బోర్డుకు ముందు పదవీ విరమణ పొందిన కార్మికుల్లో కొందరికి సంబంధించి ఆధార్ కార్డు, భార్య పేరు, పుట్టిన తేదీల్లో తప్పులు ఉండటంతో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిదంగా పాత పెన్షన్ పే ఆర్డర్‌లో ఒక నెంబర్, రివైజ్డ్ పెన్షన్ పే ఆర్డర్‌లో మరో నెంబర్ ఉండటంతో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. నవంబర్ నెలలో జీవన్ ప్రమాణ లైఫ్ సర్టిఫికెట్‌లో నెంబర్ పొందుపర్చడం సమస్యగా మారిందని, ఇదంతా రివైజ్డ్ పెన్షన్ పే ఆర్డర్లలో దొర్లిన తప్పులు తమకు ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రిటైర్డ్ కార్మికుడు ఏకారణంగానైనా మృతి చెందిన సంధర్భంలో ఆయన భార్య పెన్షన్ పొందడం నానా అవస్థలకు దారి తీస్తోంది. రిటైర్డ్ కార్మికులకు రావల్సిన కొత్త పెన్షన్ పేమెంట్ ఆర్డర్లలో దొరిలిన పొరపాట్లు సరిదిద్ది ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాదవ్ కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

నవతెలంగాణ-జన్నారం

ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ గ్రామాలకు చెందిన కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, వివిద శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మంచినీటి సమస్య రోడ్డు, విద్యుత్తు, సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో పరిష్కారం చేస్తామని తెలిపారు. వేసవికాలం గ్రామాల్లో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికీ మంచినీరు అందించాలన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు, అందుకు కావలసిన ప్రణాళికలను ముందుగానే సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలు తెలుసుకుంటూ పరిష్కరించేందుకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమర్ షరీఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి, పంచాయతీరాజ్ డీఈ సుబ్బారావు, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ జలంధర్, ఈజీఎస్ ఏపీఓ రవీందర్ పాల్గొన్నారు.

మహిళలకు ఉపాధి కల్పిస్తాం

మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో జిల్లా న్యాక్ ద్వారా నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన వారందరికీ ఉపాధి కల్పిస్తామని మహిళలు ఎవరు అధైర్యపడవద్దని ఎమ్మెల్యే వేడమ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో కుట్టు మిషన్ శిక్షణ పొందిన 27 మంది మహిళలకు ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు, కుటుంబంలోని మహిళలకు ఉచితంగా శిక్షణ అందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అధికారి కేవీఎస్ రామ్మోహన్, జిల్లా సహాయక కార్మిక కమిషనర్ ఎం సురేంద్ర కుమార్, హాయకులు నాగేంద్ర, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ముల్కల ప్రభాకర్, పీఏసీఎస్ చైర్మన్ అల్లం రవి, సుభాష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, రాజశేఖర్, నందు నాయక్, ఏవీఆర్ ఇసాక్, పార్టీ అధ్యక్ష కార్యదర్శులు ముజాఫర్, మాణిక్యం, ఇందయా రమేష్, షాకీర్ పాల్గొన్నారు.

చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలి

వేసవి కాలంలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వెడమ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పొన్కల్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలి వెంద్రాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పొన్కల్ ఈఓ రాహుల్, మండల మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్, మాజీ ఎంపీపీ మత్స శంకరయ్య, రాజశేఖర్, నందు నాయక్, మహమ్మద్ రియాజుద్దీన్, కరుణాకర్, రమేష్ ఇందయ్యా, తిరుపతి, షాకీర్ ముజ్జు, మల్యా లక్ష్మణ్, బండారి స్వామి పాల్గొన్నారు.



కుట్టు మిషన్‌లు అందజేస్తు ఎమ్మెల్యే బొజ్జు పటేల్

రిజర్వేషన్ ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

● కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీ అవకాశం కల్పించాలి

● ఎస్టీపీపీని సందర్శించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమావేశమైన ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఉద్యోగాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య సూచించారు. శనివారం సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ సంధర్శించిన ఆయన ఎస్టీపీపీ అధికారులతో పాటు ప్లాంట్ నిర్వాహణ బాధ్యతలు చేపట్టిన పవర్‌మేక్ కంపెనీ ప్రతినిదులతో సమావేశమయ్యారు. ఎస్టీపీపీని సంధర్శించిన ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్, సభ్యులకు ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాసులు పూల మొక్కలతో స్వాగతం పలికారు. ఈ సంధర్భంగా సమావేశమై ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగం, భూ సమస్యలు, ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు అందించే ప్రయోజనాలు, సంక్షేమ పథకాలు, స్థానికంగా పని చేస్తున్నటువంటి ఉదోగుల వివరాలు అడిగి తెల్సుకున్నారు. అదే విధంగా ప్లాంట్ నిర్వాహణ బాద్యతలు చేపట్టిన పవర్‌మేక్ కంపెనీ కూడా చట్ట పరంగా తగు నిష్పత్తిలో ఎస్సీ, ఎస్టీ వారికి ఉద్యోగవకాశాలు కల్పించాలని సూచించారు. జీఓ-59 ప్రకారం పవర్‌ప్లాంట్ కాంట్రాక్టు పనుల్లో ఎస్సీ, ఎస్టీ వారికి అవకాశం కల్పించాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన భూ నిర్వాసితులకు వారి యోగ్యతకు తగ్గట్టుగా ఉపాధి కల్పించాలని, అదేవిధంగా స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని అన్నారు. కమీషన్ సభ్యులు రేణుకుంట ప్రవీణ్ మాట్లాడుతూ ఎస్టీపీపీ ఆధ్వర్యంలో గ్రంథాలయం నిర్మించాలని కోరగా చైర్మన్ సానుకూలంగా స్పందించారు. సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, డిప్యూటీ జనరల్ మేనేజర్ పంతులా నాయక్ మాట్లాడుతూ ఎస్టీపీపీ ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని కోరారు. ఈ విషయంలో సింగరేణి యాజమాన్యాన్ని తమ వంతుగా కోరినప్పటికీ ఎస్టీపీపీ సంధర్శించిన ఎస్సీ, ఎస్టీ కమీషన్ ద్వారా మరో మారు గుర్తు చేస్తూ ఇందుకు పూర్తిగా సహకరించాలని కోరారు. అదే విధంగా సింగరేణి వ్యాప్తంగా, ఎస్టీపీపీ పరిధిలో ఎస్టీ ఉద్యోగుల నియామకాల నిష్పత్తిని వివరించారు. ఎస్సీఎస్టీ కమీషన్ వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ ఆధ్వర్యంలో సుదీర్ఘంగా వివిధ అంశాలపై చర్చించడంతో పాటు తగు నిర్ణయాలు తీసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ అధికారులు ఎస్సీ, ఎస్టీ కమీషన్ చైర్మన్‌తో పాటు సభ్యులు కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కోంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట ప్రవీణ్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులు, శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.



శాలువాతో సన్మానిస్తున్న అధికారులు

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

నవతెలంగాణ-జన్నారం



తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం మండలం కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో ఆ పార్టీ నాయకులు జెండాను ఎగురవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం ఆదిలాబాద్ పార్లమెంటరీ అడహక్ కమిటీ నాయకులు పులి శెట్టి శ్రీనివాస్, ఉప్పుల విజయ్ కుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల కోసం పార్టీ ఆవిర్భవించిందని గుర్తు చేశారు. మార్చి 29, 1982వ రోజు ఆవిర్భవించి, కేవలం 9 నెలల్లోనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 294 అసెంబ్లీ సీట్లలో, 202 ఎమ్మెల్యేలు స్థానాలను కైవసం చేసుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని అన్నారు. పటేల్, పట్వారి వ్యవస్థను రూపుమాపి పేదల పక్షాన నిలిచిన ఏకైన ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్ అని కొనియాడారు. రూ.2 కిలో బియ్యం, వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్లు అందించారన్నారు. ఎంతోమంది ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇచ్చారన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలు తెలుగుదేశం పార్టీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొల్లపల్లి ప్రసాద్, గంధం పద్మారావు, విజయ్, శంకర్, రోహిత్ పాల్గొన్నారు.

పెన్షన్ డబ్బుల కోసం గిరిజనుల పాట్లు

నవతెలంగాణ-తాండూర్



పెన్షన్ డబ్బుల కోసం ఇబ్బందులు పడుతున్నామని వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులు ఆవేధన వ్యక్తం చేశారు. శనివారం మాదారం పోస్ట్ ఆఫీస్‌ను సందర్శించిన జిల్లా పోస్టల్ అధికారి సిద్ధార్థకు ఫిర్యాదు చేశారు. నర్సాపూర్ గ్రామపంచాయతీకి చెందిన గిరిజనులు ప్రతి నెల వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పెన్షన్ కోసం మాదారం పోస్ట్ ఆఫీస్‌కు రావాల్సి ఉంటుంది. పెన్షన్ కోసం 20 కిలోమీటర్ల దూరం నుంచి మాదారం పోస్ట్ ఆఫీస్‌కు వస్తే పోస్టుమెన్ ఫారూక్ సకాలంలో పెన్షన్ డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గిరిజనులు వాపోయారు. పెన్షన్ డబ్బులు చెల్లించడంలో వాయిదాలు వేయడం వల్ల సగం డబ్బులు రానుపోను చార్జీలకే సరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పోస్ట్ మెన్ పని తీరు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్ట్ మ్యాన్‌ను తొలగించి ప్రతి నెల సమయానికి పెన్షన్ డబ్బులు అందేలా చూడాలని వారు జిల్లా పోస్టల్ అధికారిని కోరారు. అదే సమయంలో స్థానిక ఎంపీడీఓ శ్రీనివాస్ అక్కడికి చేరుకొని గిరిజనుల సమస్యను జిల్లా పోస్టల్ అధికారికి తెలిపారు. జిల్లా పోస్టల్ అధికారి సిద్ధార్థ మాట్లాడుతూ పెన్షన్ డబ్బులు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు. పెన్షన్ చెల్లింపు విషయంలో పోస్ట్ మాన్ అవకతవకలపై విచారణ చేపడతామని గిరిజనులకు హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలు

నవతెలంగాణ-దండేపల్లి



మండలంలోని గుడిరేవు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు ఉగాది తెలుగు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుడు కర్నే నరేందర్ ఉగాది ప్రత్యేకత గురించి విద్యార్థులకు వివరించారు. తెలుగు సంవత్సరం, నెలలు తిథి, వార, నక్షత్రాల గురించి విపులంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లూరు శ్రీనివాస్ మాట్లాడుతూ ఉగాది అంటే షడ్రుచుల సమ్మేళనమని, కష్ట సుఖాలను సమాన రీతిలో చూడాలని, కష్టం వచ్చినప్పుడు కుంగిపోవద్దని, సుఖం వచ్చినప్పుడు పొంగిపోవద్దని, జీవితం అంటే తీపి చెదుల కలయిక అనీ, అన్నింటిని తట్టుకొని జీవిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థులకు బూరెలు, ఉగాది పచ్చడిని తయారు చేసి అందించారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ లక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజశేఖర్, అనిత, లచ్చన్న, ఖండూ పాల్గొన్నారు.

ఉచిత ఈఏపీ సెట్ నమూనా పరీక్ష

నవతెలంగాణ-నస్పూర్

ఇంటర్ పూర్తి చేసుకుని ఇంజనీరింగ్, అగ్రికల్చర్ సీట్ కోసం ఈఏపీ సెట్ అప్లై చేసుకున్న విద్యార్థుకు నస్పూర్‌లోని సృష్టి ఇన్స్టిట్యూట్‌లో ఉచిత నమూనా పరీక్షను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సృష్టి డైరెక్టర్లు భాస్కర్‌రెడ్డి, కట్ల బిందియా యాదవ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 8797870303 నెంబర్‌కు ఆదివారం సాయంత్రంలోగా పేరు, గ్రూప్, ఊరు, మొబైల్ నెంబర్ ద్వారా తెలియజేసి రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. పరీక్ష ను మార్చి 31 సోమవారం ఉదయం 10 గంటలకు సృష్టి ఇన్స్టిట్యూట్‌లో నిర్వహిస్తామని పరీక్షకు సకాలంలో హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో చోరీ

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలో కాల్ టెక్స్ ఏరియాలో శనివారం తెల్లవారు జామున దోపిడీ సంఘటనలు చేసుకున్నాయి. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ వివరాల ప్రకారం సాన శ్రావణ్ ఇంట్లో బీరువా పగలగొట్టి పద్నాలుగున్నర తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.20 వేల నగదు ఎత్తుకెళ్లారు. కాగా అదే ఏరియాలో ఉన్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుధాకర్ ఇంట్లో చొరబడి రూ.70 వేల నగదు, 5 తులాల బంగారం దోచుకెళ్లారు. అంతే కాకుండా కాలనీలో ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన 4 బైకులను దొంగలు ఎత్తుకెళ్లారని తెలిపారు. బెల్లంపల్లి రూరల్ సీఐ సయ్యద్ అఫ్జలొద్దీన్, బెల్లంపల్లి టూటౌన్, తాళ్లగురిజాల, వన్‌టౌన్ ఎస్ఐ మహేందర్, రమేష్, రాకేష్, ఏఎస్ఐ తిరుపతి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు.



పంచాయతీ భవన నిర్మాణ పనుల పరిశీలన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్ గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే హరీష్‌బాబు పరిశీలించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ. 20 లక్షలతో ఈ భవన నిర్మాణ పనులు చేపడుతున్న విషయం తెల్సిందే. కాగా నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే పనులు నాణ్యతగా చేపట్టాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ భవన నిర్మాణం పూర్తయ్యితే గ్రామస్థులకు సౌకర్యంగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు.

విత్తన షాపుల తనిఖీలు

నవతెలంగాణ-కాసిపేట



కాసిపేట, ముత్యంపల్లిలోని విత్తన షాపులను మండల టాస్క్ ఫోర్స్ బృందం సభ్యులు, మండల వ్యవసాయ అధికారి చల్ల ప్రభాకర్, ఎస్‌ఐ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు. విత్తన షాపులతో పాటు గోడౌన్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నకిలీ పత్తి విత్తనాలు లేదా గ్లైపోసెట్ కలుపు మందును అమ్మితే క్రిమినల్ చర్యలు తీసుకొని, లైసెన్స్ రద్దు చేస్తామని డీలర్లను హెచ్చరించారు. విత్తనాలను ఎమ్మార్పీ ధరకు మాత్రమే విక్రయించాలని, విత్తనాలు రైతులకు అమ్మేటప్పుడు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలని, విత్తనాలకు సంబంధించి పీసీలు, ఇన్‌వాయిస్లు ఉంచుకోవాలని డీలర్లకు వివరించారు.

2న బీసీల పోరుగర్జన పోస్టర్ విడుదల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీల రిజర్వేషన్ చట్టం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఏప్రిల్ 2న నిర్వహించే బీసీల పోరుగర్జన విజయవంతం చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు లహుకుమార్ కోరారు. జిల్లా కేంద్రంలోని చైతన్య జూనియర్ కళాశాల ఆవరణలో నాయకులు, విద్యార్థులతో కలిసి "హలో బీసీ చలో ఢిల్లీ" పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీల రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దీనికి సంబంధించి చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే దిశగా ఏప్రిల్ 2న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమానికి బీసీలు పెద్ద ఎత్తున తరలి విజయవంతం చేయాలని, అప్పుడే ఆకాంక్ష పాలకులకు అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు రమేష్ రాకేశ్, శ్రీనివాస్, సంతోష్, శ్రీకాంత్, అశ్విని, శిరీష, మౌనిక, మనిషా, సంధ్య, రాణి పాల్గొన్నారు.

3 నుండి అవగాహనా తరగతులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ మూడో తేదీ నుండి 13 వరకు భౌతికశాస్త్రంలోని అంశాలపై అవగాహన తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ కె శ్రీదేవి తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న మరియు ఇంటర్ విద్యార్థులకు ఈ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని, ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుండి 9-30 వరకు నిర్వహించే ఈ తరగతులకు విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

బార్‌అసోసియేషన్ అధ్యక్షుడికి ఆత్మీయ సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాపర్తి రవీందర్ శనివారం ఎన్నికయ్యారు. దీంతో ఆయన చిన్ననాటి, పదవ తరగతి స్నేహితులు, హోలీ ట్రినిటీ పాఠశాల నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. న్యాయ వ్యవస్థలో మరింత ఉన్నత స్థానానికి ఎదగాలని మిత్రబృందం ఆకాంక్షించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ హైమద్, శ్రీనివాస్, వెంకన్న, తిరుపతి, ముషీర్, గిరిధర్, సత్యం, శ్రీకాంత్, సమ్మి ప్రభాకర్ పాల్గొన్నారు.

గోర్ బోలి భాషను గుర్తించడంపై హర్షం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

15 కోట్ల మంది బంజారాలు మాట్లాడే గోర్ బోలి భాషను అధికార భాషగా గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు భూక్య శివరాం నాయక్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గోర్ బోలి భాషను అధికార భాషగా గుర్తించి భారత రాజ్యాంగం 8వ షెడ్యూల్‌లో చేర్చాలని అసెంబ్లీ తీర్మానం చేసిన సీఎంతో పాటు ట్రై కార్ చైర్మన్, రాష్ట్ర మంత్రివర్గానికి ప్రతిపక్ష నాయకులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వివరించారు. ఎప్పటినుండో ఉన్న ఆకాంక్షను రాష్ట్ర ప్రభుత్వం నెరవేర్చడం బంజారాల మనోధైర్యాన్ని మరింత పెంచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే దీనిని 8వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు.

నేడు పంచాంగ శ్రవణం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఉగాది పండుగను పురస్కరించుకొని ఆదివారం కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాం శ్రీ శివమల్లన్న స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వేణుగోపాల్‌గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9-45 నిమిషాలకు ఆలయం ఆవరణలో వేద పండితులు ముద్దు నరహరిశర్మ, దేవాలయ అర్చకులు ఇందారపు శర్మల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉద్యోగులకు విరమణ సహజం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఉద్యోగం చేసే ప్రతి ఉద్యోగికి విరమణ అనివార్యమని ఎస్పీ డీవీ.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఎస్పీ కార్యాలయంలో ఎస్సై రాజేశ్వర్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎస్పీ హాజరై సత్కరించారు. ఆసిఫాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రాజేశ్వర్ చేసిన సేవలను కొనియాడారు. రిటైర్మెంట్ అనంతరం పోలీసు శాఖ నుండి రావాల్సిన అన్నిరకాల బెనిఫిట్స్ సకాలంలో అందేవిధంగా చూస్తామని ఎస్పీ అన్నారు. మిగిలిన శేష జీవితం అతని కుటుంబంతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణాప్రతాప్, ఆసిఫాబాద్ సీఐ రవీందర్, జిల్లా పోలీస్ సంఘం అధ్యక్షులు విజయ శంకర్ రెడ్డి, పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూసంబంధిత సమస్యలపై సమగ్ర విచారణ

- మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



అధికారులతో మాట్లాడుతూ సూచనలు చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్

ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని సింగరేణి సంస్థ పరిధిలోకి వచ్చే భూములకు సంబంధించి వచ్చే దరఖాస్తులపై రెవెన్యూ రికార్డులను సరి చూసి క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నెలలోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో బెల్లంపల్లి ఆర్డీఓ హరికృష్ణ, సింగరేణి సంస్థ శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాల జనరల్ మేనేజర్లు శ్రీనివాస్, దేవేందర్, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజావాణి కార్యక్రమాన్ని మండల, సబ్-డివిజన్, జిల్లా స్థాయిలలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ క్రమంలో జిల్లాలోని సింగరేణి పరిధిలోకి వచ్చే భూములకు సంబంధించి వచ్చే దరఖాస్తులపై రెవెన్యూ రికార్డులను సరి చూసి సింగరేణి సంస్థ అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపి నిబంధనల ప్రకారం సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో భాగంగా జిల్లాలోని జైపూర్ మండలం గుత్తేదారుపల్లె గ్రామంలో భూములు, ఇండ్లు కోల్పోతున్న బాధితులకు నిబంధనల ప్రకారం అర్హులైన వారికి నష్టపరిహారం త్వరగా అందించే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ భూములకు సంబంధించి ఆక్రమణకు పాల్పడిన అనర్హులకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా ఆక్రమణలను తొలగించాలని ఆదేశించారు. నష్టపరిహారానికి తప్పుడు వివరాలతో వచ్చిన దరఖాస్తులపై చర్యలు తీసుకోవాలని, సింగరేణి భూములు ఆక్రమణ గురైతే సంబంధిత అధికారుల ద్వారా క్షేత్రస్థాయి నివేదిక రూపొందించి, ఆక్రమణలు తొలగించే విధంగా సింగరేణి అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. సింగరేణి సంస్థ పరిధిలోకి వచ్చే భూములు, ఆస్తి పన్నులను ఎలాంటి బకాయి లేకుండా పూర్తిగా చెల్లించాలని, సింగరేణి సంస్థ ప్రభావిత ప్రాంతాలలోని ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ ఎస్టేట్ ఆఫీసర్ నవనీత, కలెక్టరేట్ సి సెక్షన్ పర్యవేక్షకులు సంతోష్, రెవెన్యూ అధికారులు, సంబంధిత సింగరేణి అధికారులు పాల్గొన్నారు.

స్కోచ్ అవార్డు అందుకున్న కలెక్టర్, ఐటీడీఏ పీఓ

- ఆరోగ్య పాఠశాల పేరిట కార్యక్రమానికి శ్రీకారం
- విద్యావ్యవస్థలో విజయవంతంగా అమలు
- విద్యార్థుల్లో అనేక మార్పులు



అవార్డు అందుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ ఖుష్బూగుప్తా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఇటీవల స్కోచ్ అవార్డుకు ఎంపికగా కాగా శనివారం ఢిల్లీలో పద్మశ్రీ డా.దీపక్, బి.పాతక్, డా.గుర్షరన్, దంజల్, వైస్ చైర్మెన్ స్కోచ్ గ్రూప్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. కలెక్టర్ రాజర్షిషా రూపకల్పనలో శ్రీకారం చుట్టి రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లాలో తొలిసారిగా ఆరోగ్య పాఠశాలను బాలల దినోత్సవం రోజు ప్రారంభించారు. ఈ ఆరు సూత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, విద్యార్థుల జీవన శైలిలో ఎన్నో మార్పులను తెచ్చిన ఈ కార్యక్రమం జిల్లాలో ఎంతో విజయవంతంగా కొనసాగుతోంది. కలెక్టర్ నేతృత్వంలో శ్రీకారం చుట్టిన ఈ కార్యక్రమం జిల్లాల్లోని అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా, ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవాటు చేసేందుకు, విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, సామాజిక నైపుణ్యాలు పెంపొందించడం కోసం రూపొందించిన కార్యక్రమమే ఈ ఆరోగ్య పాఠశాల. నవంబర్ 14వ తేదీ నుంచి అన్ని ఉన్నత పాఠశాలల్లో, కేజీబీవీ, ఇంటర్ కళాశాలల్లో ప్రారంభించారు. ఒక్కో వారం ఒక్కో అంశాన్ని అమలు చేస్తూ 4 వారాల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రతి సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత ప్రతి మంగళవారం పోషకాహారంపై అవగాహన, ప్రతి బుధవారం ఒత్తిడి నివారించుకునే మార్గాలు, ప్రతి గురువారం డ్రగ్స్‌కు దూరంగా ఉండటం, ప్రతి శుక్రవారం కాలానుగత వ్యాధుల నివారణ, ప్రతి శనివారం వ్యక్తిత్వ వికాసం ఇలా ఆరు సూత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచి అలవాట్లను అలవర్చుకోవాలని రేపటి భావిభారత పౌరులు మీరేనని, చెడు వ్యసనాలకు దూరంగా, మద్యం, పొగాకు వంటి వాటికి దూరంగా ఉండి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. చదువులో రానిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకొని ఆదర్శవంతంగా నిలవాలని ఏర్పాటు చేసిన ఈ వినూత్న కార్యక్రమం విద్యార్థుల్లో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆరోగ్య పాఠశాల కార్యక్రమం ఇటీవల స్కోచ్ అవార్డుకు ఎంపిక కావడంతో అవార్డు అందుకున్నారు. కలెక్టర్ అవార్డు అందుకున్న నేపథ్యంలో సోషల్ మీడియా వేదిక ద్వారా జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు. అదేవిధంగా ఉట్నూర్ ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాకు కూడా స్కోచ్ అవార్డు వచ్చింది. పీఓ ఏజెన్సీలో గిరిజన పోషణ్ మిత్ర, గిరిజన క్యాంటీన్‌లను ఏర్పాటు చేశారు. దీనికి గాను స్కోచ్ అవార్డు వచ్చింది. ఈ నేపథ్యంలో పలువురు అభినందనలు తెలిపారు.

ఘనంగా టీడీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



నస్పూర్ : ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీడీపీ నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తలారి రాజు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్‌లోని పార్టీ ఆఫీస్ వద్ద పార్టీ జెండాను సీనియర్ నాయకులు మిడిదొడ్డి మొండయ్య ఆవిష్కరించగా, బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి తలారి రాజు జెండాను ఎగరవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రజల సంక్షేమం కోసం 1982 మార్చి 29న టీడీపీని స్థాపించారన్నారు. స్థాపించిన తొమ్మిది నెలలకే రాజ్యాధికారాన్ని చేపట్టి ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించామన్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో తెలంగాణలో పార్టీ పూర్వ వైభవం సంతరించుకుంటుందని, కార్యకర్తలకు నాయకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలియజేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పోటీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆవుల సుధాకర్, టిఎన్‌టియుసి నాయకులు సామ రఘుపతి, నాయకులు రాజు, పెంటయ్య, కుమార్, వడ్లకొండ వెంకన్న, నర్సోజి, మల్లయ్య పాల్గొన్నారు.

ఇచ్చోడ : మండలంలోని ఆడేగామ(కె) గ్రామంలో శనివారం తెలుగుదేశం రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రటరీ రేసు పోతారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతారెడ్డి మాట్లాడుతూ 1982వ సంవత్సరంలోఎన్టీఆర్ బడుగు బలహీనవర్గాల అభివృద్ధే ధ్యేయంగా పార్టీని ఏర్పాటు చేశారని అన్నారు. అనాడు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చూసి ప్రజల్లో రాజకీయ చైతన్యం నింపిన మహనీయుడన్నారు. రాబోవు రోజుల్లో తెలంగాణలో తెలుగుదేశం పార్టీని అధికారంలో తేవడానికి కృషి చేస్తామని పటేల్ పట్వారి వ్యవస్థను రద్దుచేసి ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చినటువంటి నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజేశ్వర్, బరుకుంటా శంకర్, దర్శనాల లింగన్న పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులకు సన్మానం

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మార్చి 31న ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులను శనివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసి డీఈఓ పి.రామారావు వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత జీవితాన్ని కూడా వదిలి, విద్యార్థులకు విద్యా బోధనను అందించారని అన్నారు. వీరు ఎందరో భావి పౌరులను దేశానికి అందించారు. వీరి కృషికి గుర్తింపు ఉంటుందని అన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు కృత్రిమ మేధస్సు సహాయంతో అద్భుతాలు సృష్టిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయులు కాలానుగుణంగా మార్పును గ్రహించాలని, వాటిని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఉద్యోగ విరమణ పొందు ఉపాధ్యాయులు తమ భావి జీవితాన్ని మంచి ఆరోగ్యంతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలని అన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చిన అండగా ఉంటామని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఫైనాన్స్ అండ్ అకౌంట్స్ అధికారి రమణారెడ్డి, పరీక్షల సహాయ కమీషనర్ ముడారపు పరమేశ్వర్, పర్యవేక్షకులు వెంకట రమణ, విద్యాశాఖ సమన్వయ కర్తలు రాజేశ్వర్, నర్సయ్య, సలోమీ కరుణ, ప్రవీణ్ కుమార్, లింబాద్రి, డీసీఈబీ సహాయ కార్యదర్శి భానుమూర్తి, ఉపాధ్యాయ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష కిలోమీటర్ల రథయాత్ర కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ-నేరడిగొండ

ధర్మ సమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహారాజ్ లక్ష కిలోమీటర్ల రథయాత్రకు సంబంధించిన కరపత్రాలను శనివారం మండల కేంద్రంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డాక్టర్ విశారదన్ మహారాజ్ లక్ష కిలోమీటర్ల రథయాత్ర చేస్తున్నారని, ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 14న మాభూమి రథయాత్ర ప్రారంభ సభతో మొదలై తెలంగాణలో ఉన్న 33 జిల్లాలు, 612 మండలాలు, 12వేల గ్రామాలలో మూడు సంవత్సరాల పాటు మూడున్నర కోట్ల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు చైతన్యం చేసి, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మా బీసీ, ఎస్సీ, ఎస్టీల ప్రభుత్వాన్ని ఏర్పాటు దిశగానే ఈ యాత్రను కొనసాగిస్తామని అన్నారు. బడ్జెట్‌లో 30శాతం విద్యకు, 30శాతం వైద్య రంగానికి, 30శాతం ఉపాధి రంగానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు గంగయ్య సంతోష్, ఖదీర్, భూమన్న ప్రవీణ్, అడెల్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ప్రధాన రహదారి చౌరస్తా వద్ద దేవాపూర్ గ్రామ పంచాయతీ సహకారంతో ప్రజల తాగునీటి కోసం చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఎంపీడీఓ సత్యనారాయణ, ఎంపీఓ శేఖ్ సఫ్టర్ అలీ ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి కవిత, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్పీఎం ఎన్నికలకు ఆర్‌ఓ నియామకం

- ఏప్రిల్ 3లోగా ధృవపత్రాలు అందజేయాలని

యూనియన్లకు లేఖలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియకు ఎట్టకేలకు ముందడుగు పడింది. ఈ ఎన్నికల నిర్వహణకు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ (ఆదిలాబాద్) రాజేశ్వరిని నియమిస్తూ కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం నుండి శనివారం అన్ని యూనియన్లకు లేఖలు అందాయి. రిటర్నింగ్ అధికారి హెూదాలో డీసీఎల్ రాజేశ్వరి అన్ని యూనియన్లకు లేఖలు పంపించారు. అండర్ టేకింగ్ సర్టిఫికెట్స్, అఫిలియేషన్ సర్టిఫికెట్ (ఒరిజినల్), యూనియన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఒరిజినల్), యూనియన్ బై లాస్, వార్షిక రిటర్న్, కార్మికుల మెంబర్‌షిప్ లిస్ట్ తదితర వివరాలను ఏప్రిల్ మూడో తేదీలోగా డీసీఎల్ కార్యాలయంలో సమర్పించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పెంచాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని చింతగూడ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న భగత్ సింగ్ నగర్ పాపమ్మగూడలో ని 81/1 సర్వే నెంబర్‌లోని భూమిని పేదలకు పంపిణీ చేసి ఇందిరమ్మ పథకంలో ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్ అన్నారు. శనివారం ఇల్లు లేని నిరుపేదలతో కలిసి మండల తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని చింతగూడ పాపమ్మగూడ సర్వేనెంబర్ 81 /1లో ఉన్న ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలన్నారు. జాయింట్ సర్వే నిర్వహించాలని అనేక సంవత్సరాలుగా ప్రభుత్వ అధికారులకు తహసీల్దార్ నుంచి మొదలుకొని కలెక్టర్ వరకు పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రాలు ఇచ్చామన్నారు. జాయింట్ సర్వే చేసి పేదలకు భూములు పంపిణీ చేస్తామని అధికారులు హామీ ఇచ్చిన ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. ప్రభుత్వ అధికారులు ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ భూమి విషయంలో కొందరు గ్రామస్తులకు సంబంధం లేకుండా భూ పోరాటంపైన తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని వారి ఫిర్యాదులను నమ్మవద్దని తహసీల్దార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శెట్టి బాపు, గ్రామస్తులు రజిత, లక్ష్మి, పోచవ్వ, నాగలక్ష్మి మల్లేష్, మామిడి రాజన్న, భాస్కర్, ఆకిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన

నవతెలంగాణ-తాండూర్

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం సికిల్‌సెల్ అనీమియాపై అవగాహన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూనీస్ సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు, స్క్రీనింగ్ పరీక్షలు, కౌన్సెలింగ్, చికిత్స గురించి వైద్య సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో మెడికల్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలి

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి యాజమాన్యం గత సంవత్సరం మార్చి 14న జూనియర్ అసిస్టెంట్(క్లరికల్) 365 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి సంవత్సరం గడుస్తున్న ఇప్పటివరకు భర్తీ చేయలేదన్నారు. సింగరేణి వ్యాప్తంగా అని గనులు డిపార్ట్మెంట్లు, అన్ని రకాల ఆఫీసుల నందు కీలక పాత్ర పోషిస్తున్న క్లర్కల్స్ సిబ్బంది తీవ్రమైన పని భారానికి, ఒత్తిడికి గురవుతున్నారని, పెరిగిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా రోజువారి ప్రతి పనిలో వీరి యొక్క పాత్ర, ఉద్యోగులకు సంబంధించిన పర్సనల్, అకౌంట్స్, ఉత్తర ప్రత్యుత్తరలు విషయంలో క్రియాశీలంగా మారిందన్నారు.వీరు లేనిదే సింగరేణిలో పని జరగదని అనటంలో అతిశయ యొక్తి లేదన్నారు.కావున ఈ పోస్టుల సంఖ్యను పెంచుతూ వెంటనే భర్తీ చేయాలని, అంతే కాకుండా యాక్టింగ్ క్లర్క్ గా పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



నవతెలంగాణ-బోథ్

సొనాల మండలంలోని సాకెర గ్రామపంచాయతీలో శనివారం నూతన ఎంపీడీఓ దుర్గం రాజేశ్వర్, ఆర్‌ఐ శ్యాంసుందర్‌రెడ్డిలను గ్రామస్తులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామాల్లో నీటి సమస్యతో పాటు గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సంతోష్, భీమ్‌రావ్, కాకాజీ, శేఖర్, సుధాకర్, భారత్, విష్ణు, జ్యోతి పాల్గొన్నారు.

న్యాయవాది మంగేష్‌కు సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాది మంగేశ్ దేవ్‌తాడే ఇటీవల ఆదిలాబాద్ బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి నివాసంలో శనివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మంగేష్‌ని శాలువాతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మావల మండలాధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నవీన్‌రెడ్డి, సంజయ్ పాల్గొన్నారు.

